కొర్రీలెందుకో..?

ధాన్యం కొనుగోళ్లలో ఆంక్షలు

- రైతుకు 12.5 ఎకరాలే పరిమితి
- గతంలో 25 ఎకరాలకు ఈ-క్రాప్ వర్తింపు
- గడచిన రబీ నుంచి తొలగింపు
- ఎకరానికి 40 బస్తాల ధాన్యం అమ్ముకునే వెసులుబాటు
- రబీలో అంతకుమించి ఉత్పత్తులు



ఏలూరు రూరల్ మండలం మల్కాపురం సమీపంలో ధాన్యాన్ని ఆరబెడుతున్న మహిళ

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి పశ్చిమలో ధాన్యం దిగుబడులు అధి కం. ఖరీఫ్‌లో సగటున 40 బస్తాలు, రబీలో 55 నుంచి 60 బస్తాలు దిగుబడి వస్తుంది. అయితే ధాన్యం కొనుగోలు విషయంలో గత ఏడాది రబీ నుంచి ప్రభుత్వం ఆంక్షలు పెట్టింది. 25 ఎకరాల వరకు వున్న ఈ-క్రాప్ నమోదు పరిమితిని 12.5 ఎకరాలకు కుదించడంతో ఆచంట, తాడేపల్లి గూడెం, గణపవరం వంటి ప్రాంతాల్లో అధిక భూములున్న రైతులు ధాన్యం విక్రయించడా నికి ఇబ్బందులు పడుతున్నారు.

రబీలో ఎకరానికి 60 బస్తాల వంతున ధాన్యం పండుతోంది. ఈ లెక్కన ఈ-క్రాప్‌లో 12.5 ఎకరాలు నమోదు చేసినా ఫలితం లేక పోతోంది. కేవలం ఎనిమిది ఎకరాల్లో ఉత్పత్తి అయిన ధాన్యాన్ని మాత్రమే విక్రయించగలుగు తున్నారు. ప్రభుత్వం ఎకరానికి 40 బస్తాల ధాన్యాన్ని పరిమితం చేయడంతో ఇదీ సమస్యగా మారింది. అంతకుమించి వెసులుబాటు కల్పించే అవకాశం లేదు. గతంలో 25 ఎకరాల పరిమితి వుంటే ఇబ్బంది ఉండేది కాదు. అధిక దిగు బడులు సాధించినా ప్రభుత్వానికి అమ్ముకునే సదుపాయం ఉండేది. రబీ నుంచే సమస్య ఎదురవు తోంది. అధిక భూములున్న రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

మల్లగుల్లాలు పడుతున్న అధికారులు

ఈ-క్రాప్ పరిమితులపై అధికారులు మల్ల గుల్లాలు పడుతున్నారు. పౌరసరఫరాల కార్పొ రేషన్ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసు కువెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో అధిక భూములు వున్న రైతులను గుర్తించి, వీరి జాబితాను ప్రభుత్వానికి పంపి అనుమతులు తీసుకుందామన్న ఆలోచనతో అధికారులు ఉన్నా రు. ఈ-క్రాప్ పరిమితి పెంచితే ఇబ్బందులు ఉండేవి కాదు. ప్రతి సీజన్‌లోనూ అనుమతులు తీసుకోవాలంటే కష్టతరమవుతోంది. ధాన్యం విక్ర యించడంలో జాప్యమవుతోంది. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పరిశీలించి వెసులుబాటు కల్పించా లని రైతులు కోరుతున్నారు.

ఇతర రాష్ట్రాల్లోనూ పరిమితులు

ఈ-క్రాప్ విధానంపై ఒక్కో రాష్ట్రం ఒక విధా నాన్ని అమలుచేస్తోంది. కొన్ని రాష్ట్రాల్లో రైతులు 7.5 ఎకరాలకు మాత్రమే ఈ-క్రాప్ చేసుకునే వెసులుబాటు ఇచ్చారు. ఆ లెక్కన రాష్ట్రంలో 12.5 ఎకరాలు కాస్త ఉపశమనం కలిగించినట్టే. అయితే జిల్లాలో ధాన్యం ఉత్పత్తులు అధికం కావడంతో మొత్తం ఉత్పత్తులను విక్రయించా లంటే ప్రభుత్వ షరతులు ఆందోళన కలిగిస్తు న్నాయి. దీనిపై వ్యవసాయశాఖ, పౌరసరఫరాల కార్పొరేషన్‌లోనూ చర్చ సాగుతోంది. వెసులు బాటు ఇస్తే ప్రభుత్వ కొనుగోలు దుర్వినియోగం అవుతుందన్న అనుమానాలు ఉన్నాయి. ఒక్కో సారి ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం దిగుమతి చేసుకుంటున్నారు. వ్యాపారులు ఇలా దిగుమతి చేసుకున్న ధాన్యాన్ని ఇక్కడ రైతుల పేరుతో ప్రభుత్వానికి అమ్మకాలు సాగిస్తున్నారు. ఒడిశా, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి పెద్ద మొత్తంలో దిగుమతయ్యేవి. దిగు మతి చేసుకున్న జిల్లాలో తూర్పు గోదావరి ప్రథమ స్థానంలో ఉంది. ఇప్పుడు పరిస్థితులు మారాయి. ఒడిశా వంటి రాష్ట్రాల్లో బోనస్ ప్రకటించారు. ఇక్కడికంటే ఆ రాష్ట్రంలోనే అధిక ధర వచ్చే అవకాశం ఏర్ప డింది. దీంతో దిగుమతులు తగ్గుముఖం పడుతు న్నాయి. జిల్లాలో ప్రతి సీజన్‌లోనూ లక్ష్యాన్ని చేరుకుంటున్నారు. ధాన్యం ఒబ్బిడి చేసిన వెంట నే మిల్లులకు చేరిపోతున్నాయి. అంతేవేగంగా సొమ్ములు రైతుల ఖాతాల్లో జమవు తున్నాయి. ఈ విషయంలో రైతుల్లో జోష్ నెలకొంది. పరిమితి తగ్గించడంతోనే కొందరు రైతులు అమ్మకానికి తంటాలు పడుతున్నారు.

సాగునీటి సంఘాల.. సమరం!



సాగునీటి సంఘాల ఎన్నికలకు మరోసారి కసరత్తు ఆరంభమైంది. తొలుత జిల్లా యంత్రాంగం ఈ నెల చివరి వారంలోపు ఎన్నికలు ముగించేలా సన్నాహాలు ఆరంభించింది. అయితే ఈనెలలో నీటి సంఘాల ఎన్నికలు జరిపేదిలేక వాయిదా వేశారు. వచ్చే నెల 8 నుంచి 14వ తేదీ లోపు నిర్వహించేందుకు మళ్లీ సన్నా హాలు ఆరంభించారు. ఈలోపు ఓటరు జాబితాలోను స్పష్టత రాలేదు. అనేక మంది కౌలు రైతులు కూడా తాము ఓటర్లమేనని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకురావడంతో ఇప్పుడు ఆ దిశగా కూడా కథ మళ్లీ మొదటికొచ్చింది.

- వచ్చేనెల 5న నోటిఫికేషన్
- 14లోపు ఎన్నికలు పరిసమాప్తం
- ఈనెలలో జరగాల్సి ఉన్నా వచ్చే నెలకే పొడిగింపు
- ఇప్పటికీ కొలిక్కిరాని ఓటర్ల జాబితా
- క్షేత్రస్థాయిలో ఓటుకు కౌలు రైతుల పట్టు
- ఎటూ తేల్చుకోలేని యంత్రాంగం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

జిల్లా వ్యాప్తంగా సాగునీటి సంఘాలు, డిస్ట్రి బ్యూటరీలు, ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వ హించేందుకు ఎన్నికల కమిషన్ తాజాగా కొత్త తేదీలను ప్రకటించింది. జిల్లాలో మొత్తం 356 నీటి సంఘాలు ఉన్నాయి. మైనర్ ఇరిగేషన్ పరిధిలో 253, మేజర్ ఇరిగేషన్ పరిధిలో 92, మీడియం ఇరిగేషన్ పరిధిలో మరో 11 నీటి సంఘాలు ఉన్నాయి. కృష్ణా డెల్టాలో ఎనిమిది డిస్ట్రిబ్యూటరీలు, గోదావరి డెల్టాలో నాలుగు, నాగార్జునసాగర్ పరిధిలో రెండు డిస్ట్రిబ్యూటరీలు కలిపి 14 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు నిర్వహిస్తారు. తమ్మిలేరు, ఎర్రకాల్వ ఈ రెండిం టికి ప్రాజెక్టు కమిటీలను ఎన్నుకోవాల్సి ఉంది. వాస్తవానికి ఈనెలలోనే ఎన్నికలు నిర్వహించేం దుకు అంతా సిద్ధం చేశారు. ఒకటో తేదీన నోటి ఫికేషన్, ఆ తదుపరి విడతల వారీగా ఈనెల 21 నుంచి 29లోపు మూడు దశలుగా ఎన్నికలు పూర్తి చేయాలని సంకల్పించారు. ఓటరు జాబి తాలు సిద్ధం చేయాలని సూచించారు. సాగునీటి సంఘాల పరిధిలోని ఆయకట్టుదారులను ఓట ర్లుగా పరిగణించాల్సి ఉంది. గడిచిన ఐదేళ్ల క్రితం వరకే సాగిన ఈ తరహా ఎన్నికలు ఆపై జరగకపోవడంతో ఈలోపు ఓటర్ల జాబితాలను ఆగమేఘాల మీద సవరించలేకపోయారు. అసెంబ్లీ జరుగుతుండడం, ఎన్నికల పర్యవేక్షణకు ప్రజాప్రతినిధులకు అవకాశం లేకపోవడంతో ఈ నెలలో జరగాల్సిన ఎన్నికలను వాయిదా వేయా ల్సిందిగా అత్యధికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వాస్తవానికి శుక్రవారం నాటితో శాసన సభ సమావేశాలు ముగిశాయి. ఇదే రోజు నాటి కి సాగునీటి సంఘాల ఎన్నికలు ఇంతకు ముందు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం పూర్తి కావాల్సి ఉంది. ఆ తర్వాత డిస్ట్రిబ్యూటరీ కమి టీలు, ప్రాజెక్టు కమిటీల ఎన్నికలను ముగించాల్సి ఉంది. కాని ఎన్నిక వాయిదా కోరడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ డిమాండ్‌వైపే మొగ్గు చూపింది. ఒకవైపు అధికార కూటమి పక్షాలు, ఇంకోవైపు వైసీపీ, మరోవైపు వామపక్షాల అనుకూలురు సాగునీటి ఎన్నికల్లో దిగేందుకు ఉత్సాహపడుతు న్నారు. చాలాచోట్ల తెలుగుదేశంలో ఉన్న సీని యర్లను కాదని మిగతా పక్షాల్లో ఉన్న జూని యర్లు సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఫలితా లను ఆశించడం కొంత గందరగోళంగానే ఉంది. జిల్లా స్థాయిలోనే ఈ వ్యవహారమంతా సజా వుగా ముగిసేలా చూడాలని ఆదేశాలు వెలు వడినా ఇప్పటి వరకు ఆయా పార్టీల ముఖ్యు లెవరూ ఈ అంశంపై భేటీకాలేదు. ఎందుకంటే ఎవరెవరు ఎంతమేర పోటీ పడాలనేదే ఇత మిద్ధంగా తేలకపోవడమే. ఇదేక్రమంలో వైసీపీ అనుకూలురు వీలైతే కొన్ని చోట్ల అయినా తాము పోటీకి దిగాలన్న కోణంలోనే ఉన్నారు. ఈ పరిస్థితుల్లో వచ్చే నెల రెండో వారం ముగిసే లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసే దిశగా ఎన్నికల కమిషన్ తాజాగా ఉత్తర్వులు ఇచ్చింది.

తాజా షెడ్యూల్ ఇది..

సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరిగేందుకు వీలుగా వచ్చే నెల 5న నోటిఫికేషన్ విడుదల చేస్తారు. 8వ తేదీన 356 నీటి సంఘాలకు ఎన్నికల ప్రక్రియ నిర్వహిస్తారు. అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, సభ్యులతోపాటు కమిటీ ఏర్పడేలా అధి కారులు చూడాల్సి ఉంది. 11వ తేదీన 14 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు జరుపు తారు. 14వ తేదీన రెండు ప్రాజెక్టు కమిటీ లకు ఎన్నికలు జరిపి ఈ ప్రక్రియను ముగిస్తారు.

సర్పంచ్, సెక్రటరీ మధ్య కుర్చీ వివాదం!

కైకలూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కైకలూరు పంచాయతీలో సర్పంచ్, సెక్రటరీల మధ్య కుర్చీ వివాదం నెలకొనడంతో ఆఫీసు వరండాలోనే కార్యదర్శి విధులు నిర్వహిస్తుం డడం చర్చనీయంశంగా మారింది. గత పదేళ్ల గా పంచాయతీ కార్యదర్శి విధులు నిర్వహిస్తు న్న గదినే సర్పంచ్ తన రూమ్‌గా మార్చాలని పట్టుబడడంతో ఈ వివాదం ఏర్పడింది. కైక లూరు పంచాయతీ కార్యదర్శిగా ఆనందభూష ణం 48 రోజుల క్రితం బదిలీపై వచ్చారు. నేటికీ చార్జీ అప్పగించక పోయినా ఆఫీసులో ఉంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమం లో సర్పంచ్, కార్యదర్శి ఒకే రూమ్‌లో రెండు కుర్చీలు వేసుకుని కూర్చునేవారు. పది రోజుల క్రితం ఇద్దరి మధ్య వివాదం ఏర్పడగా కార్యదర్శి కుర్చీని బయట వేయాలని సర్పంచ్ సిబ్బందికి మౌఖిక ఆదే శాలు జారీ చేయడంతో వివాదం పెద్దదైంది. కార్యదర్శి ఆనందభూషణం కార్యా లయం భవనంలోని వరండాలోనే కూర్చొని విధులు నిర్వహిస్తున్నారు. కైకలూరు పంచా యతీ కార్యదర్శిగా విధుల్లోకి చేరి శుక్రవారం నాటికి 48 రోజులు అయింది. గతంలో ఇన్‌చార్జి కార్యదర్శిగా పనిచేసిన ఆదిరాజు వెంకటేశ్వర రావు బదిలీపై మచిలీపట్నం వెళ్లారు. ఇంకా ఆయన ఇక్కడ నాకు చార్జి అప్పగించలేదు. అయినా చిన్నపాటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నా. కార్యదర్శికి కేటాయించిన గదిలో కూర్చునేందుకు కుర్చీ ఇవ్వకపోవడం అత్యంత దారుణం. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశా' నంటూ కార్యదర్శి ఆనందభూషణం తెలిపారు.



పంచాయతీ కార్యాలయ వరండాలో విధులు నిర్వహిస్తున్న కార్యదర్శి ఆనందభూషణం

- 'పూర్తిస్థాయి పంచాయతీ కార్యదర్శి వచ్చారని సంతోషిస్తున్నాం. నేను సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పంచాయతీ కార్యాలయంలో సెంటిమెంట్‌గా అదే రూమ్‌లో కూర్చుంటున్నాను. కార్యదర్శి, నేను ఒకే రూమ్ లో కూర్చొని ప్రజల సమస్యలను విని పరిష్క రించేందుకు కృషి చేస్తున్నాం. ఈ తరుణంలో కార్యదర్శే నన్ను వేరే రూమ్‌కు మారాలన్నారు. దీంతో కార్యదర్శినే మరో రూమ్‌లో కూర్చోమని చెప్పిన మాట వాస్తవమే'.నంటూ సర్పంచ్ డీఎం నవరత్నకుమారి తెలిపారు.

నేడు, రేపు ఓటర్ల నమోదు

ఏలూరుసిటీ, నవంబరు 22 (ఆంధ్ర జ్యోతి) : భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఫొటో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 23, 24 తేదీల్లో శని , ఆదివారాల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవెల్ అధికారులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉండాలని డీఆర్వో విశ్వేశ్వర రావు ఆదేశించారు. అర్హులైన వారు 6, 7, 8 దరఖాస్తు ఫారాలను పూర్తి చేసి ఇచ్చిన వాటిని స్వీకరించాలన్నారు.

ఏఆర్ డీఎస్పీగా చంద్రశేఖర్

ఏలూరు క్రైం, నవంబరు 22 (ఆంధ్ర జ్యోతి) : ఏలూరు జిల్లా ఆర్మ్డ్ రిజర్వు పోలీస్ విభాగానికి డీఎస్పీగా బి.చంద్రశేఖర్‌ ను నియమిస్తూ రాష్ట్ర డీజీపీ రాజేందర్‌నాథ్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో పనిచేస్తున్న ఏఆర్ డీఎస్పీలలో 29 మందిని వివిధ విభాగాలకు బదిలీ చేశారు. కాకినాడ లో జిల్లా ఆర్మ్డ్ రిజర్వు విభాగంలో డీఎస్పీగా పనిచేస్తున్న చంద్రశేఖర్‌ను ఏలూరు జిల్లా ఏఆర్ విభాగానికి డీఎస్పీగా నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న డీఎస్పీ విజి శ్రీహరిరావును కాకినాడ జిల్లా ఆర్మ్డ్ రిజర్వు విభాగం డీఎస్పీగా నియమించారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

కలెక్టర్ వెట్రిసెల్వి.. ఏలూరు ప్రభుత్వాస్పత్రి ఆకస్మిక తనిఖీ



ఆసుపత్రిలో క్యూలో ఉండి ఓపీ టిక్కెట్ తీసుకుంటున్న జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని గాడిలో పెట్టేందుకు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఉపక్రమించారు. ఈ మేరకు ఆస్పత్రిని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సుమారు రెండు గంటల పాటు ప్రతి విభాగాన్ని పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చిన కలెక్టర్ ఓపీ రిజిస్ట్రేషన్ సెంటర్‌కు వెళ్లి తన ఫోన్ నంబర్ చెప్పి ఓపీ తీసుకున్నారు. ఆ నంబర్ ప్రకారం ఆర్థోపెడిక్ డాక్టర్‌ను సంప్రదించి కాలికి పరీక్షలు చేయించుకుని మందుల చీటిని తీసు కొని మందులు ఇచ్చే కౌంటర్ వద్దకు వెళ్ళి మం దులు తీసుకుని రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారా.. లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివిధ విభాగాలను, ఆస్పత్రి పరిసరాలను పరిశీ లించారు. ఆస్పత్రి ప్రాంగణంలో ఉంచిన ప్రైవే ట్ వాహనాలను ఆర్డీవోకు అప్పగించాలని ఆదే శించారు. వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు.

సమయపాలన పాటించాలి..

ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేసే సిబ్బంది, వైద్యులంతా తప్పనిసరిగా సమయ పాలన పాటించాలని కలెక్టర్ ఆదే శించారు. ప్రభుత్వ ఆస్పత్రి నిర్వహణ తీరుపై శుక్రవారం సంబంధిత అధి కారులు, సిబ్బందితో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు, మిని స్టీరియల్ స్టాఫ్ ఎఫ్ఆర్ఎస్ హాజరును ప్రతిరోజు ఉదయం 9.30 గంటలకల్లా తనకు నివేదికను సమర్పించాలన్నారు. ఆస్పత్రిలో వైద్యుల కొరత నివారించేం దుకు డీఆర్పీ వైద్య విద్యార్థుల నియా మకంపై డీసీహెచ్ఎస్‌తో కలెక్టర్ సమీ క్షిస్తూ వైద్య సేవలు అందించేందుకు ముందుకు వచ్చే బెస్ట్ డీఆర్పీలకు అవార్డులు అందించి సత్కరిస్తామన్నారు. డిప్యూటేషన్‌పై ఇద్దరు వైద్యులను క్యాజువాలిటీ సేవలు అందించేందుకు నియమించాలని డీఎం హెచ్‌వోను ఆదేశించారు. సదరం సర్టిఫికెట్ల జారీకి వైద్యుల కొరత ఉన్నందున ఈ విష యంపై వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ కార్య దర్శికి ప్రతిపాదనలు పంపాలన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్ శర్మిష్ట, డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్‌కుమార్, ఆర్ఎంవో డాక్టర్ దుర్గాకుమార్, ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్, ఆసుపత్రి ఏడీ కుమార్, ఆస్పత్రి మినిస్టీరియల్ సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

ఏలూరుసిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పొగాకు పంటలో నియంత్రణ పాటించి పొగాకు పంటకు ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారిం చాలని కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొగాకు ప్రత్యామ్నాయ పంటలపై రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో చర్చా వేదిక నిర్వహించారు.

నాడు - నేడు పనులపై విచారణ

ముదినేపల్లి, నవంబరు 22 (ఆంధ్ర జ్యోతి): పెదపాలపర్రు జడ్పీ హైస్కూల్‌లో నాడు-నేడు పనుల నిర్వహణలో అవకతవ కలు జరిగాయని అప్పటి హెచ్ఎం శాంత కుమారిపై వచ్చిన ఆరోపణలపై శుక్రవారం విద్యాశాఖ అధికారులు తుది విచారణ నిర్వ హించారు. ఆర్జేడీ నాగమణి ఆదేశాల మేరకు హైస్కూల్‌లో నూజివీడు డీవైఈవో సేవ్యా నాయక్, ఏలూరు జిల్లా విద్యాశాఖ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ అవధాని హెచ్ఎం శాంత కుమారిని విచారించారు. సంబంధిత సొమ్మును ఆమె నుంచి రికవరీ చేసేందుకు చర్యలు తీసుకుం టున్నట్టు ఏడీ తెలిపారు. ఆరోపణలపై సస్పెండ్ అయి ప్రస్తుతం ఇంగిలింపాక లంక హైస్కూల్ హెచ్ఎంగా నియామకం పొందిన శాంతకుమారికి పెదపాలపర్రు హైస్కూలు ఇన్‌చార్జ్ హెచ్ఎం పాండురంగారావు నుంచి జీతాలకు సంబంధించి ఎల్‌పీసీ కూడా ఇప్పించారు. దీంతో గత తొమ్మిది నెలలుగా జరుగుతున్న శాఖాపరమైన విచారణ ముగిసినట్లేనని అధికారులు తెలిపారు.



నాడు-నేడు పనులపై విచారణ జరుపుతున్న అధికారులు

పదవుల్లో పశ్చిమకు ప్రాధాన్యం

- పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా భీమవరం ఎమ్మెల్యే అంజిబాబు.. సభ్యుడిగా తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి

భీమవరం/టౌన్/తణుకు, నవంబరు 22 (ఆంధ్ర జ్యోతి): తెలుగుదేశం కూటమి ప్రభుత్వ పదవుల్లో పశ్చిమకు ప్రాధాన్యం కొనసాగుతోంది. తాజాగా పబ్లిక్ అకౌంట్స్ చైర్మన్‌గా భీమవరం ఎమ్మెల్యే అంజిబాబు, సభ్యుడిగా తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఎన్నిక య్యారు. వివాదరహితులుగా పేరున్న వీరిద్దరిని ఈ పదవు లకు ఎంపికచేశారు. రాష్ట్ర అసెంబ్లీలో శుక్రవారం జరిగిన ఎన్నికల్లో వీరు విజయం సాధించారు. భీమవరం నుంచి అంజిబాబు మూడోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా పశ్చిమకు పదవి రావ డం ఇదే తొలిసారి. కూటమి ప్రభుత్వంలో కీలక పదవు లు పశ్చిమకు వరిస్తున్నాయి. మంత్రి పదవి, డిప్యూటీ స్పీకర్, రెండు ప్రభు త్వ విప్‌లు, నాలుగు కార్పొరేషన్ పదవులు జిల్లాకు దక్కాయి. ఇక పశ్చిమ గోదావరి జిల్లా లోవున్న ముగ్గురు జనసేన ఎమ్మెల్యేలకు పదవులు దక్కాయి. తాడేపల్లిగూడెం, నర్సాపురం ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, బొమ్మిడి నాయకర్ ప్రభుత్వ విప్‌లుగా నియ మితులయ్యారు. తాజాగా అంజిబాబుకు మరో కీలక పద వి అయిన పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ పదవి వరిం చింది. ఇలా కూటమి ప్రభుత్వంలో జనసేన పార్టీలో కీలక పదవులు జిల్లాకు దక్కాయి. అత్యధిక పదవులు వరించిన జిల్లాగా పశ్చిమ గుర్తింపుపొందింది. రాష్ట్ర ప్రభు త్వంలో అత్యంత కీలకమైన ఆదాయ వ్యయాలను సరిచేసే కమిటీలో సభ్యులు కావడానికి అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్, ఐటీ శాఖ మంత్రి లోకేష్‌కు రాధాకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.



సీఎం చంద్రబాబును కలిసి కృతజ్ఞతలు చెబుతున్న పీఏసీ చైర్మన్ అంజిబాబు, సభ్యుడు ఆరిమిల్లి రాధాకృష్ణ. చిత్రంలో కొళ్ల నాగేశ్వరరావు

ఫీజు మీది.. పరీక్ష మాది

కుక్కునూరు ప్రైవేటు డిగ్రీ కాలేజీలో నిర్వాకం 7

త్రికరణశుద్ధిగా దీక్ష చెయ్యాలి



అయ్యప్ప మాల దీక్షాపరులు తప్పనిసరిగా త్రికరణ శుద్ధితో 41 రోజులు (మండలం) దీక్ష చెయ్యాలి. మాల ధారణ చేసినప్పటినుంచి సూర్యోదయానికిముందు, సూర్యాస్తమయ సయమానికి చన్నీటి స్నానం చెయ్యాలి. ఏకభుక్తం, భూశయనం. చెయ్యాలి. దీక్ష తీసుకునే సమయంలో వివాహం కాని వారు తల్లి, వివాహం అయినవారు భార్య అనుమతి తీసుకోవాలి. అయ్యప్పస్వామి ఆలయం నవంబరు 16 నుంచి డిసెంబరు 26 వరకు తెరుస్తారు. అందుకే నవంబరు 16 తేదీకి చేరుకునేలా మండల దీక్ష తీసుకుంటారు. నాలుగురోజులు ఆలయం కట్టి వేసి తిరిగి డిసెంబరు 31 నుంచి జనవరి 20 తేదీవరకు ఆలయాన్ని తెరుస్తారు. అప్పడే జనవరి 14న మకరజ్యోతి దర్శనం ఉంటుంది. ఆ రోజుకు అక్కడకు చేరుకునేలా మాలధారణ చేసుకుంటారు. శనిదోష నివారణ కోసం దీక్షలు తీసుకునేవారు ఉంటారు. ఇరుముడి అంటే రెండు ముడులు అని అర్థం..ఒక దానిలో నేతితో నింపిన ముదురు కొబ్బరికాయ, అభిషేక వస్తువులతో పాటు మాలికాపురత్తమ అమ్మవారికి సంబంధించి రెండు జాకెట్టు ముక్కలు పసుపు, కుంకుమ, తదితర సంబారాలు వేస్తారు. మరో దానిలో బియ్యం, పెసరపప్పు, యాలకులు, లవంగాలు, వంటివి వేస్తారు. కాలినడక వెళ్తున్న సమయంలో ఈ సంబారాలతో వంట చేసుకుని భుజించేందుకు వీటిని తీసుకువెళతారు.



ఆకొండి ఆదినారాయణ మూర్తి ,
దీక్షా గురువు ,మాముడూరు



ధైర్యం..శక్తిని ప్రసాదించే హనుమాన్ దీక్ష

జంగారెడ్డిగూడెం : హనుమత్ దీక్షాదారులు రాష్ట్రంలోనే ప్రముఖ హనుమత్ క్షేత్రంగా పేరుగాంచిన జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం గ్రామంలో ఉన్న శ్రీమద్ది అంజనేయస్వామి ఆలయంలో ఇరుముడులు సమర్పించి దీక్ష విరమిస్తారు. 1985 నుంచి ఈ ఆలయంలో హనుమత్‌దీక్షలు ప్రారంభమయ్యాయి. అత్యంత భక్తిశ్రద్ధలతో, నియమ నిబంధనలతో 41రోజుల పాటు హనుమత్‌దీక్షను భక్తులు చేపడతారు. కార్తీక శుద్ధ విదియ నుంచి నెలపొడుపు వచ్చినప్పటి నుంచి హనుమాన్ మాలధారణ చేస్తారని, మార్గశిరమాసం త్రయోదశి నాడు హనుమత్ వ్రతం, చతుర్దశి నాడు ఇరుముడి కట్టుకుని పౌర్ణమిరోజు మద్ది ఆంజనేయస్వామి ఆలయం వద్ద జరిగే పూర్ణాహుతికి మాలధారులు హాజరై దీక్షా విరమణ చేస్తారని ఆలయ ఆస్థానాచార్యులు వేదాంతం రంగప్రసాద్ తెలిపారు. 41 రోజులు, 21 రోజులు ఈ మాలను ధరిస్తారని, ఎక్కడి నుంచి అయినా మాల ధరించవచ్చని తెలిపారు. తల్లి, గురుస్వామి, ఆలయ అర్చకులు ద్వారా మాల స్వీకరించవచ్చని తెలిపారు. కార్తీక మాసంలో, తర్వాత వైశాఖ బహుళ దశమి నాడు హనుమత్ జయంతికి 41 రోజుల ముందు ఈ మాలను ధరిస్తారని వివరించారు.

శనీశ్వరుడు కూడా చేపట్టాడు




1995 నుంచి ఇప్పటివరకు 15 సార్లు మాల వేసుకున్నా.. హనుమత్‌దీక్ష అతిపవిత్రమైనది. అన్ని దీక్షల్లోనూ హనుమత్ దీక్ష ప్రథమంగా కార్తీక మాసంలో ప్రారంభ మవుతుంది. శనీశ్వరుడు కూడా 40 రోజులపాటు ఈ దీక్ష చేశాడని పురాణ ప్రతీతి. బుద్ధి, బలం, శక్తి, ఆరోగ్యం కలగాలన్నా, సోమరితనం వీడి చైతన్యం పొందాలన్నా ఈ దీక్ష చేయాలి.

తనికెళ్ళ రవికుమార్,
గురుస్వామి, జీలుగుమిల్లి

కార్తీకమాసం ఎంతో పవిత్రమైన మాసం.. శివ, కేశవులకు ఇష్టమైన మాసమని పూజలకు, వ్రతాలకు శ్రేష్టమైనదని కార్తీక పురాణం దార్వా తెలుస్తున్నది. అందుకే ఈ మాసంలో చాలామంది తమ భక్తిని చాటుకునేందుకు పలు దీక్షలు చేపడతుంటారు. మాలధారణ ద్వారా ఆత్మసంతృప్తితో పాటు, భక్తి జ్ఞానాన్ని పొందుతారు.తమ ఇష్టదైవాలకు సంబంధించి దీక్షలను స్వీకరిస్తున్నారు. అయ్యప్పస్వామి మాల, కనకదుర్గమ్మ భక్తులు భవానీ మాల, ఆంజనేయస్వామి భక్తులు ఆంజనేయమాల, ఈశ్వరునికి సంబంధించి శివమాల, వేంకటేశ్వరస్వామి భక్తులు గోవిందమాల, మావుళ్ళమ్మ దీక్ష ఇలా పలు దీక్షలు చేపడుతుంటారు.. ఏ దీక్ష చేపట్టినా.. ఏ మాల ధరించినా అందులోని అర్థం..పరమార్థం.. ఒక్కటే.. ఆధ్యాత్మిక చింతనతో పాటు భక్తి, జ్ఞానాన్ని గ్రహించడమే మాలధారణ పరమార్థం కావాలి..

ద్వారకాతిరుమల / భీమవరం టౌన్ (ఆంధ్రజ్యోతి)

మాలధారణం.. నియమాల తోరణం



పూజలు, వ్రతాలకు కార్తీకమాసం ప్రత్యేకమైనది... ఈ మాసంలోనే ఎక్కువమంది మాలలు ధరిస్తుంటారు.. శివ దీక్ష, భవానీ, అయ్యప్ప, ఆంజనేయస్వామి, గోవిందమాల, మావుళ్లమ్మ ఇలా భక్తులు పలు దీక్షల చేపడుతుంటారు. ఈ మాలధారణలో ఎన్నో నియమాలు ఉన్నప్పటికీ అన్ని దీక్షల్లోనూ ఇంచుమించు నియమాలన్నీ ఒకే రకంగా ఉంటాయి.. 108 రోజులైతే మహా మండల దీక్ష, 41 రోజులు మండల దీక్ష, 21 రోజులు అర్ధమండల దీక్షలు సాధారణంగా స్వాములు చేపడుతుంటారు. దీక్షాదారులు మాలధారణ సమయంలో ఆయా దేవతామూర్తులకు ఇష్టమైన రంగు దుస్తులు ధరిస్తారు. గోవింద మాల దారులు పసుపు, శివ మాలదారులు చందనం లేదా నీలిరంగు, ఆంజనేయ మాలధారులు కాషాయం, అయ్యప్ప నలుపురంగు దుస్తులు ధరించాలి. త్రికాలము లందు స్నానము చేసి విధిగా ఆయా దేవతామూర్తుల పూజలు చేయాలి. నుదుటున చందనం, విభూతి, సింధూరం, కుంకుమ బొట్లు పెట్టుకోవాలి. దీక్షా సమయంలో మౌనవ్రతులై ఉండాలి. మితంగా మాట్లాడాలి. అనుక్షణం దైవభక్తితో ఉండాలి. ఒంటి పూట శాఖాహార భోజనం చేస్తూ నేలపై నిద్రించాలి. బ్రహ్మచర్యం పాటించాలి. ఎవరి పనులు వారు చేసుకుంటూనే వీలైనంత వరకూ ఆధ్యాత్మిక చింతనతో మెలగాలి. గోవింద దీక్ష చేపట్టినవారు జనవరి 11న, భవానీ దీక్షా దారులు డిసెంబరు 23న, శివస్వాములు మార్గశిర శుద్ధ పాడ్యమినాడు పోలిని స్వర్గానికి పంపేరోజైన డిసెంబరు 2న దీక్ష విరమించనున్నారు. గోవిందస్వాములు ముక్కోటి నాడు శ్రీవారికి ఇరుముడులు సమర్పించి దీక్ష విరమించనున్నారు. అంతకు ముందురోజున మధ్యాహ్నం గిరిప్రదక్షిణలో పాల్గొననున్నారు. ఆతరువాత స్వామి వారి నిజరూపదర్శనాన్ని చేసుకుని దీక్షావిరమణ చేస్తారు. బయటి ఆహారానికి దూరంగా ఉండాలి. మాంసాహారం, ధూమపానం, మద్యసేవనం, దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలి. కోపం తెచ్చుకోకూడదు. అబద్ధాలు చెప్పరాదు. మాటలతో, చేతలతో ఇతరుల మనోభావాలను దెబ్బతీయరాదు. షేవింగ్‌లు, జుట్టు కత్తిరింపులు చేయరాదు.

కార్తీకమాసం..దీక్షా కాలం

ముక్తిదాయకం.. భవానీ మాల

అమ్మలగన్న అమ్మ కనకదుర్గమ్మ ఆశీస్సుల కోసం భక్తులు భవానీ దీక్ష చేపడుతుంటారు. విజయవాడ కనకదుర్గ అమ్మవారి దేవస్థానం నిర్ణయించే తేదీలకు అనుగుణంగా భవానీలు మాలధారణ చేస్తారు. ముఖ్యంగా ఆశ్వీయజ మాసంలో వచ్చే నవరాత్రుల దీక్షలకు అనుగుణంగా దీక్ష చేపడతారు. ఎరుపు రంగు వస్త్రాలు ధరిస్తారు. 41 రోజులపాటు దీక్ష చేపడతారు. దీక్షదారులు అమ్మ అనుగ్రహం కోసం కాటుక, కాలికి గజ్జెలు, చేతికి గాజులు వంటివి ధరిస్తారు. విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఇరుముడులను సమర్పించి దీక్షలను విరమిస్తారు. ఇరుముడిలో అమ్మవారికి సంబందించిన గాజులు, కుంకుమ, పసుపు, కాటుక, అభిషేక ద్రవ్యాలు, జాకెట్టుముక్కలు, నేతితో నింపిన కొబ్బరికాయలతో ఉన్న ఇరుముడితో వెళ్తారు.

మహిమాన్వితం మావుళ్ళమ్మ దీక్ష



భక్తుల కొంగు బంగారం, ఇలవేల్పు మావుళ్ళమ్మ అమ్మవారి దీక్ష 17 సంవత్సరాలుగా కొనసాగుతోంది. మహిమాన్వితం మావుళ్ళమ్మ దీక్ష . అప్పట్లో మద్దిరాల రామలింగేశ్వర శర్మ దీక్షలను ప్రారంభించారు. ఆలయంలో ప్రధానార్చకుడు లేదా అర్చకులు దీక్ష తీసుకుని భక్తులకు మాల ధారణ చేస్తారు. ఇతర దీక్షల మాదిరిగా బయట ఎవరూ దీక్షలు ఇచ్చే ఆచారం లేదు.41 రోజుల పాటు దీక్ష . దీక్షాదారులు ఉదయం, సాయంత్రం అమ్మవారి ఆలయానికి చేరుకుని పూజలు చేయించుకుంటారు.ప్రతీ సంవత్సరం ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి నాడు దీక్షాధారణ చేస్తారు. 41 రోజులు పూర్తయిన తరువాత ఆలయం వద్ద దీక్ష విరమణ, పూర్ణాహుతి ఉంటుంది. ఇక్కడ రెండు ఇరుముడు కడతారు. ఒక దానిలో అమ్మవారికి సంబంధించిన గాజులు, జాకెట్టుముక్క, పసుపు, కుంకుమ, కాటుక, వంటి వేస్తారు. మరో ఇరుముడులో పూర్ణాహుతికి సంబంధించిన వస్తువులను వేసి కడతారు. ఇరుముడిని ధరించి గ్రామ ప్రదిక్షణ చేసి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని హోమగుండంలో ఇరుముడిలోని వస్తువులను వేసి దీక్షను విరమిస్తారు.

మద్దిరాల మల్లిఖార్జున శర్మ,
మావుళ్లమ్మ ఆలయ ప్రధానార్చకుడు

పరమేశ్వరుని అనుగ్రహం కోసమే..



పరమేశ్వరుని అనుగ్రహ కటాక్షాల కోసం భక్తులు ఇప్పుడు శివ దీక్షలు తీసుకుంటున్నారు. ఇతర దీక్షల వల్లే ఈ శివ దీక్షకు కూడా నియమాలు ఉంటాయి. నేలపై నిద్ర, ఒంటిపూట భోజనం సూర్యోదయానికి ముందు స్నానంతో పాటు స్వామివారి దర్శనం, సాయంత్రం సమయంలోను ఇదే పద్ధతి ఉంటుంది. 41 రోజులు తప్పనిసరిగా స్వామివారి దర్శనంతో పాటు దీక్షలో ఉన్నంత వరకు శివనామ స్మరణతో ఉండాలి. శ్రీశైలం మల్లిఖార్జున స్వామి ఆలయంలో దీక్ష విరమణ చేస్తారు. సాధారణంగా కార్తీక మాసం, మహాశివరాత్రికి దీక్షలను స్వీకరిస్తారు. ఇరుముడిలో స్వామివారికి అభిషేకం నిమిత్తం ఆవుపాలు, ఆవునెయ్యి, తేనె, పంచదార, సుగంధద్రవ్యాలు, విభూది, గంధం, వట్టివేళ్ళు ఉంటాయి.

చెరుకూరి రామకృష్ణ, అర్చకులు,
సోమేశ్వరాలయం, భీమవరం

మోక్షప్రదాయకం..శివదీక్ష



భక్తుల మొరలాలించి వరాలిచ్చే బోళా శంకరుడు శివయ్య. పద్నాలుగేళ్లుగా ఈ శివ మాలను ధరిస్తున్నాను. ఇప్పటికే నేను ద్వాదశ జోతిర్లింగాలైన సోమేశ్వర, శ్రీశైలం, మహాకాళేశ్వరం, ఓంకారేశ్వరం, వైద్యనాథ్, భీమేశ్వరం, రామేశ్వరం, నాగేశ్వర్, వారణాసి, త్రయంబకేశ్వరం, కేదారేశ్వర్, ఘృశ్లేశ్వర్ క్షేత్రాలను సందర్శించాను. ఏ దీక్షనైనా భక్తులు నియమ నిష్టలతో ఆచరించాలి. శివుడు నిర్మలుడు.. నిరంజనుడు.. ఆదిదేవుడైన శివయ్యను ఆలంబనగా చేసుకుని ఆచరించబడేదే శివ దీక్ష.

తాళ్లూరి ప్రకాష్, గురుస్వామి, ద్వారకాతిరుమల



అభిషేకం చేస్తున్న శివ స్వాములు



చిన వెంకన్నను దర్శించుకున్న గోవింద మాలధారులు



కుంకుమ పూజలు చేస్తున్న మావుళ్లమ్మ భక్తులు

ఆదివాసీ గ్రామాలకు బహుళ ప్రయోజన భవనాలు

మల్టీ పర్పస్ సెంటర్ల నిర్మాణానికి నిధులు



చెట్టు కిందనే సమావేశం నిర్వహించుకుంటున్న ఆదివాసీలు (ఫైల్)

బుట్టాయగూడెం, నవంబరు 22 : (ఆంధ్రజ్యోతి) :పశ్చిమ ఏజెన్సీ ఆదివాసీలకు బహుళ ప్రయోజనకర మైన భవనాలు అందుబాటులోకి రానున్నాయి. అటవీ ప్రాంతాల్లో నివాసాలుంటున్న కొండరెడ్డి గిరిజనులు నేటికీ సభలు, సమావేశాలు, సదస్సులు, శుభకార్యాలు, నిర్వహించుకోవాలంటే సరైన భవన సదుపాయం లేక చెట్ల నీడనే ఆశ్రయిస్తున్నారు. కొండరెడ్డి గ్రామాల్లో ఎటువంటి భవనాలు అందుబాటులో లేకపోవడం వల్ల గ్రామాలకు వెళ్ళిన అధికారులు చెట్ల కింద సమావేశాలు, సదస్సులు నిర్వహిస్తున్నారు. కొండరెడ్డి గ్రామాల్లో భవనాల ఇబ్బందులను గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏజెన్సీ ప్రాంతంలోని కొండరెడ్డి గ్రామాల్లో బహుళ ప్రయోజనకర భవనాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టాయి. అందుకు పీఎం జన్‌మన్ ఫేజ్-2లో పథకంలో రూ.9.60 కోట్ల నిధులను కూడా మంజూరు చేశాయి. దీంతో కొండరెడ్డి గ్రామాల్లో బహుళ ప్రయోజనకర భవనాలు త్వరలోనే అందుబాటులోకి రాను న్నాయి. బుట్టాయగూడెం, పోలవరం మండలా ల్లోని రేపల్లె, లంకపాకల, గొట్టాలరేవు, రేగుల పాడు, రెడ్డిబోడ్డేరు. మోతుగూడెం, తానిగూడెం, వేరుమద్దిగూడెం, గుమ్ములూరు, వీరన్నపాలెం, నాగన్నగూడెం, ఎప్పరిల్ల, చిలకలూరు. ఉడత పల్లి, కల్లుమామిడి, తంగేడుకొండ 16 గ్రామాల్లో ఎంపీసీ (మల్టీ పర్పస్ సెంటర్లు) భవనాలను నిర్మిస్తుండగా ఒక్కొ భవనానికి ప్రభుత్వం 60 లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు కేఆర్ పురం ఐటీడీఏ ఇంజనీరింగ్ ఈఈ టి.లత, డీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

పాదయాత్రగా చిన వెంకన్న క్షేత్రానికి..



కొవ్వూరు వైపు నుంచి ప్రధాన రహదారిపై నడిచి వస్తున్న యాత్రికులు

ద్వారకాతిరుమల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్న క్షేత్రానికి కాలినడకన వచ్చే యాత్రికుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. జిల్లా నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి పాదయాత్రగా భక్తులు వచ్చి తమ మొక్కుబడులు తీర్చుకుంటున్నారు.ఈక్రమంలో తూర్పు, పశ్చిమ, కృష్ణాజిల్లాల నుంచి నడిచి వచ్చేవారు శుక్రవారం సాయంత్రానికి క్షేత్రానికి చేరుకుని విశ్రమిస్తున్నారు. శనివారం ఉదయం స్వామి తొలిదర్శనాన్ని చేసుకుంటున్నారు. నల్లజర్ల, దేవరపల్లి, కొవ్వూరు. నిడదవోలు, ఏలూరు. తాడేపల్లి గూడెం, రాజమండ్రి వంటి పలు ప్రాంతాలకు చెందిన వారు ఆలయానికి చేరుకోవడంతో పరిసరాలు భక్తులతో కళకళలాడాయి. పాదయాత్రగా జాతీయ రహదారి వెంబడి వచ్చే యాత్రికులు రాత్రివేళ పలు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.



కోటి దీపోత్సవ కాంతులు

భీమవరం టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం పురస్కరించుకుని గునుపూడి గ్రామ దేవత ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ దేవస్థానం వద్ద గునుపూడికి చెందిన యర్రంశెట్టి వాసు, గొన్నా శ్రీనివాస్ ఆధ్వర్యంలో కోటి దీపోత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై స్వామివారితో పాటు అమ్మవారి ఉత్సవమూర్తిని ఉంచి ప్రత్యేక పూజలు చేయించారు.మహిళలు జ్యోతులను వెలిగించారు. నీరాజన మంత్ర పుష్పాలతో కార్యక్రమాన్ని పరిసమాప్తి చేశారు. కోటి దీపోత్సవాన్ని తిలకించటానికి భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంతం కిటకిటలాడింది.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఏలూరు క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరు క్రీడల పట్ల ఆసక్తి చూపి రోజుకు ఒక గంట పాటు అయినా ఆటలు ఆడడం వల్ల శారీరక ధృడత్వంతో పాటు మానసిక ఉల్లాసం పెంపొందించుకోవచ్చునని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో శుక్రవారం ఉదయం పోలీస్ వార్షిక స్పోర్ట్స్‌మీట్‌ను ఎస్పీ ప్రారంభించారు. జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ల పోలీసులు కవాతు నిర్వహించారు. అనంతరం బెలూన్‌లు ఎగురవేసి ఎస్పీ స్పోర్ట్స్ మీట్ ప్రారంభించారు. స్పోర్ట్స్ అంటే లగ్జరీగా భావిస్తారని స్పోర్ట్స్‌ను స్పోర్టీవ్‌గా తీసుకుంటే ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉంటారని సూచించారు.అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న ప్రజలకు స్పోర్ట్స్‌లో ప్రోత్సాహాన్ని కలిగించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాతకాలంలో ప్రతి పోలీస్‌స్టేషన్ వద్ద వాలీబాల్, టెన్నిస్ కోర్టులు ఉండేవని గుర్తుచేశారు. జిల్లా అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు, ఏఆర్ అదనపు ఎస్పీ శేఖర్, ఏఆర్ డీఎస్పీ శ్రీహరి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



ఏలూరు పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో స్పోర్ట్స్ మీట్‌లో క్రీడా ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్పీ కిశోర్











ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్లకు చెందిన పోలీసులు

మూగ జీవాలకు ప్రాణం పోస్తూ..

అత్యవసర వైద్యానికి కేరాఫ్‌గా నిలుస్తున్న తణుకు పశు ఆరోగ్య సంస్థ

తణుకు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మనకు చిన్న అనారోగ్యం చేస్తే వెంటనే ఆసుపత్రికి పరుగు పెడతాం.. అదే ఆపరేషన్ చేయాలంటే ఏ ఆసుపత్రి అయితే బావుంటుందని.. ఏ డాక్టర్ బాగా చేస్తారని ఎంక్వైరీ చేస్తాం.. మూగ జీవాలకు కూడా రోగాలొస్తాయి.. వాటికి కూడా శస్త్ర చికిత్సలు చేయాల్సిన పరిస్థితి వస్తుంది.. క్లిష్టమైన ఆపరేషన్లు చేయడానికి తణుకులో పాతూరులో ఉన్న పశు ఆరోగ్య సంస్థ కేరాఫ్ అడ్రస్ అని చెప్పవచ్చు.. ఎందుకంటే అక్కడకు జిల్లానుంచే కాకుండా ఉభయగోదావరి జిల్లాల నుంచి కూడా మూగ జీవాలను వైద్యం కోసం తీసుకొస్తుంటారు. ఇక్కడ పనిచేస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీధర్ చాలా ఓపిగ్గా వాటికి శస్త్ర చికిత్సలు చేసి పంపిస్తున్నారు. మరో డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వాకాని ప్రసాదు కూడా సర్జరీలు చేస్తున్నారు. ఇటీవల మూగ జీవాల పట్ల మనుషులకు ప్రేమ ఎక్కువైంది. వాటిని కుటుంబ సభ్యుల్లో ఒకరిగా బావిస్తున్నారు.వాటికి ఏమాత్రం అనారోగ్యం వచ్చినా యజమానులు తట్టుకోలేకపోతున్నారు. వేలల్లో ఖర్చు చేసి వైద్యం అందిస్తున్నారు.



- అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం గూడపల్లికి చెందిన సాయిరామ్‌కు చెందిన కుక్క 15 రోజులు క్రితం బిల్డింగ్‌పై నుంచి పడిపోయింది. దీంతో ఎడమ భాగం కాలు జాయింట్ వదిలేసింది. చుట్టుపక్కల పశువుల ఆసుపత్రిలు ఉన్నా సౌకర్యాలు లేవు. దీంతో తణుకులో ఆసుపత్రికి తీసుకొచ్చి కాలుకు ఆపరేషన్ చేయించారు. స్టీలు రాడ్‌లు వేశారు. ఇందుకు ఆరు వేలు ఖర్చయింది. మాతో పాటు 15 సంవత్సరాల నుంచి ఈ కుక్క ఉంటోందని కూలి పనులు చేసుకునే నాకు ఈ ఖర్చు భారమే అయినా దానితో నాకున్న అనుబంధం కంటే ఎక్కువేమీ కాదని సాయిరామ్ చెప్పాడు.



- పెనుగొండకు చెందిన వెంకన్న బాబుకు చెందిన పుంగనూరు ఆవు ముందు కాలు మోకాలు వద్ద డెక్క వద్ద విరిగిపోయింది. ఆటోలో తణుకు ఆసుపత్రికి తీసుకొచ్చి వైద్యం చేయించాడు. కాలుకు ఆపరేషన్ చేసి కాలు చుట్టు ప్లేట్లు బిగించారు. పదివేలు వరకు ఖర్చు అయ్యింది. ఆవు కోలుకోవడానికి తొమ్మిది నెలల సమయం పట్టింది.



- తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం రెడ్డి చెర్వు గ్రామానికి చెందిన సీహెచ్ శ్రీనివాసుకు చెందిన కుక్కను మోటారు సైకిల్ డీకొట్టింది. దీంతో కాలు విరిగిపోయింది. కాలు సట్ట జారిపోయింది. ఐరన్ రాడ్‌లు వేసి ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం బాగానే ఉంది. ఇలా ఆసుపత్రికి ప్రతిరోజు కనీసం యాభై వరకు కుక్కలు, ఆవులు, గేదెలు ఇరవై వరకు వస్తుంటాయి.



కాలికి ఆపరేషన్ జరిగిన ఆవు



ఆపరేషన్ చేసిన తర్వాత కుక్క

అత్యవసర కేసులే వస్తాయి

తమ వద్దకు వివిధ ప్రాంతాల నుంచి అత్యవసర కేసులు వస్తాయని డాక్టర్ శ్రీధర్ అన్నారు. సాధారణంగా ఇతరుల వద్ద నయం కాని కేసులు, రిఫరల్ కేసులు, సర్జరీ కోసం, ఈనడంలో ఇబ్బందులు (ఆవులు, గేదెలు), ప్రసూతి కేసులు ఎక్కువగా వస్తుంటాయి. మా దగ్గర ఉన్న వసతులు బట్టి పూర్తి న్యాయం చేయడానికి ప్రయత్నిస్తాం.

డాక్టర్ శ్రీధర్, పశుసంవర్దక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్



కోర్టు బయట మధుతో జిల్లా సీపీఎం నాయకులు

కోర్టుకు హాజరైన మాజీ ఎంపీ మధు

నరసాపురం,నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి పి.మధు శుక్రవారం నరసాపురం జిల్లా అదనపు కోర్టుకు హాజరయ్యారు. నరసాపురం మండలం తుందుర్రు ఆక్వా ప్యాక్టరీ నిర్మాణానికి వ్యతిరేకంగా సీపీఎం రెండు సంవత్సరాలు పాటు ప్రజా పోరాటం చేసింది.ఈ ఉద్యమాల్లో మధు కొన్నిసార్లు పాల్గొన్నారు. ప్రజలను రెచ్చగొట్టారంటూ ఆయనపై అభియోగంపై అప్పట్లో కేసు నమోదు చేశారు. ఈ కేసు వాయిదాల నిమిత్తం మధు ఇప్పటికే రెండు సార్లు కోర్టుకు హాజరయ్యారు. మధుతో పాటు ఈ కేసులో ఉన్న ఉద్యమ నాయకులు కూడా కోర్టుకు శుక్రవారం వచ్చారు. జిల్లా సీపీఎం నాయకులు బలరాం, మామిడిశెట్టి రామాంజనేయులు తదితరులు మధును కలిశారు.

జూదరుల అరెస్ట్

మండవల్లి నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలం భైరవపట్నం శివారు చెరువు వద్ద గురువారం రాత్రి జూదం ఆడుతున్న పదిమందిని మండవల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి లక్షా 13 వేలు నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రామచంద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సూర్యనారాయణ రాజుకు కన్నీటి వీడ్కోలు

తలకొరివి పెట్టిన కేంద్ర మంత్రి వర్మ



తల్లితో కలసి తండ్రికి నివాళులర్పిస్తున్న శ్రీనివాసవర్మ.. సూర్యనారాయణరాజు అంతిమ యాత్ర

భీమవరంటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ తండ్రి సూర్యనారాయణ రాజు (91) అంత్య క్రియలు శుక్రవారం భీమవరంలో నిర్వహించారు. సూర్యనారాయణ రాజు కొంత కాలంగా అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్సపొందుతూ గురువారం మృతి చెందిన సంగతి తెలిసిందే. సూర్యనారాయణ రాజు జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిగా పని చేసి రిటైర్ అయ్యారు. అలాగే స్వాతంత్ర్య సమరయోధులుగాను, తామ్రపత్ర అవార్డు గ్రహీతగా పేరున్నది. శుక్రవారం సూర్యనారాయణరాజు భౌతిక కాయాన్ని భీమవరం నరసయ్య అగ్రహారంలోని స్వగృహానికి తీసుకొచ్చారు. ఆ తర్వాత అంతిమ యాత్ర నిర్వహించారు. టూటౌన్‌లోని మోక్షదామంకు చేరిన తర్వాత .కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ తండ్రి పార్థివ దేహానికి తలకొరివి పెట్టారు. అంతిమ యాత్రలో మంత్రి వెంట బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు, జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఉమ్మడి జిల్లా జనసేన అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు పరామర్శ

కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరామర్శించారు. అసెంబ్లీ సమావేశాల్లో ఉన్న సీఎం చంద్రబాబు శ్రీనివాస వర్మకు ఫోన్ చేసి సూర్యనారాయణ రాజు మృతి పట్ల సంతాపం తెలియజేశారు. ఇటువంటి క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని చెప్పారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

నివాళులు: సూర్యనారాయణ రాజు మృతికి పలువురు నివాళులు అర్పించారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ భీమారావు, డీఎస్పీ జయ సూర్య, మాజీ ఎమ్మెల్సీ పాందువ్వ శ్రీను, బీజేపీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజి, మీడియా జిల్లా కన్వీనర్ నరిసే సోమేష్, పాలకొల్లు బీజేపీ పాలకొల్లు పట్టణ అధ్యక్షుడు జక్కంపూడి కుమార్, కొల్లికొండ ప్రసాద్, ఉన్నమట్ల కపర్ధి, భీమవరం ప్రముఖులు గోకరాజు రామరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు,) డాక్టర్ గోపాలరాజు, గాదిరాజు సుబ్బరాజు, పారిశ్రామికవేత్త ఇర్రింకి సూర్యారావు, ఏఎస్ రాజు, నరసాపురం టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, మెంటే పార్థసారథి, జుత్తిగ నాగరాజు తదితరులు నివాళులు అర్పించారు.

షాక్ కొడుతుంది.. జాగ్రత్త!

- పెరుగుతున్న విద్యుత్ ప్రమాదాలు
- ప్రమాదాలకు కారణాలు అనేకం
- అరికట్టడానికి విద్యుత్ శాఖ చర్యలు
- గ్రామాల్లో అవగాహన సదస్సులు



ఏలూరుసిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఈ ప్రమాదాలను అరికట్టటానికి విద్యుత్ శాఖ చర్యలు చేపడుతూనే ఉంది. అయినా అవగాహనా లోపం కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యవసాయ ప్రాంతం కావడంతో తరచూ పంట పొలాల్లో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. పొలాల్లోనే కాకుండా ఇళ్ల వద్ద తరచూ విద్యుత్ ప్రమాదాల్లో పలువురు గాయపడుతుండగా మరి కొందరు మృత్యువాత పడుతున్నారు. మరోవైపు విద్యుత్ తీగలు పడి పశువులు సైతం మృత్యువాత పడుతున్నాయి.

ఏటా పెరుగుతున్న ప్రమాదాలు

జిల్లాలో విద్యుత్ ప్రమాదాలు ఏటా పెరుగుతున్నట్టు విద్యుత్ శాఖ అధికారుల నివేదికలు చెబుతున్నాయి. 2024-25లో జిల్లాలో 37 విద్యుత్ ప్రమాదాలు జరగగా 18 మంది మరణించగా , 19 పశువులు మృతి చెందాయి. అయితే గతేడాది కంటే ప్రమాదాలు తగ్గాయి. విద్యుత్ ప్రమాదాల నివా రణకు విద్యుత్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రజలతో పాటు, రైతుల్లో అవగాహన కలిగించడంతో పాటు ఎక్కడైనా విద్యుత్ ప్రమాదాలు జరగడానికి అవకాశం ఉన్న విద్యుత్ లైన్లను సరిచేయాలని నిర్ణయించి ంది. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి ముందు జాగ్రత్తగా చర్యలు చేపడితే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని విద్యుత్ శాఖ భావిస్తోంది. గ్రామాల్లో అవగాహనా సదస్సులు నిర్వహి ంచి ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి విద్యుత్ శాఖ కృషి చేస్తోంది.

భద్రతా సూచనలు

- ఇళ్లల్లో అంతర్గత వైరింగ్‌కు ఉపయోగించే విద్యుత్ వైర్లు , స్విచ్‌లు, హోల్డర్లు, ఇతర పరికరాలను నాణ్యత కలిగిన (ఐఎస్ఐ) వాటిని ఉపయోగించాలి.
- ఇంటిలోని స్విచ్ బోర్డులను భద్రతా ప్రమాణాలు పాటిస్తూ తగినంత ఎత్తులో అమర్చుకోవాలి.
- విద్యుత్ సర్వీస్ కోసం వినియోగించే సర్వీస్ వైరు నాణ్యమైన, లోడ్‌కు అనుగుణంగా కెపాసిటీ వాడితే విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ఓల్టేజి హెచ్చు, తగ్గులను నివారించవచ్చు.
- ప్రతి ఇంటి విద్యుత్ సర్వీస్‌కు తప్పనిసరిగా ఎర్త్ పైపు ద్వారా ఎర్తింగ్‌ను ఏర్పాటు చేయాలి
- వర్షం పడుతున్నప్పుడు విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లు ముట్టుకోరాదు.
- తడిచేతులతో , తడి కాళ్లతో ఉన్నప్పుడు స్విచ్‌లను వేయరాదు.
- విద్యుత్‌కు సంబంధించిన సమస్యల పరిష్కారం కొరకు సంబంధిత విద్యుత్ శాఖ సిబ్బందిని మాత్రమే సంప్రదించాలి. ఇతర ప్రైవేటు వ్యక్తులను సంప్రదించరాదు.
- కొబ్బరి , పామాయిల్ తోటలలో కొమ్మలు తొలగించేటప్పుడు విద్యుత్ శాఖ సిబ్బందికి లేదా 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ముందుగా తెలిపితే లైన్‌క్లియర్ ఏర్పాటు చేస్తారు.
- వీధి దీపాలకు సంబంధించిన ఫేజ్ వైర్ మరమ్మతులకు లైన్‌క్లియర్ తీసుకుని అనుమతించిన సిబ్బంది మాత్రమే చేయాలి. ఇతర వ్యక్తులు చేయరాదు.
- విద్యుత్ తీగలు తెగి పడిఉంటే విద్యుత్ శాఖ సిబ్బందికి లేదా 1912 నెంబరుకి సమాచారం ఇవ్వాలి
- పారిశ్రామిక, వాణిజ్య వినియోగదారులు , విద్యుత్ పరికరాలను రిపేర్ చేయువారు విద్యుత్ భద్రతా నియమాలను పాటించాలి.

ఈ ఏడాది విద్యుత్ ప్రమాదాలు డివిజన్ల వారీగా..

విద్యుత్ డివిజన్	ప్రమాదాల సంఖ్య	మృతుల సంఖ్య	మృతి చెందిన పశువులు
ఏలూరు	8	3	5
నిడదవోలు	5	3	2
తాడేపల్లిగూడెం	3	3	0
నరసాపురం	4	2	2
భీమవరం	4	3	1
జంగారెడ్డిగూడెం	13	4	9
మొత్తం	37	18	19

ప్రమాదాల నివారణకు చర్యలు



గ్రామాల్లో చేతికందే విద్యుత్ వైర్లు ఎక్కడైనా ఉంటే వాటిని సరిచేయాలని ఆదేశాలిచ్చాం. విద్యుత్ పోల్‌కు పోల్‌కు మధ్య దూరం ఎక్కువగా ఉంటే మధ్యలో విద్యుత్ స్థంభాలు ఏర్పాటు చేస్తున్నాం. తుప్పు పట్టిన స్థంభాలను తొలగిస్తున్నాం. దెబ్బతిన్న విద్యుత్ వైర్లు ఎక్కడైనా ఉంటే వాటిని తొలగించి అక్కడ కొత్త వైర్లు ఏర్పాటు చేస్తున్నాం. గ్రామాల్లో సదస్సులు నిర్వహించి ప్రజలకు, రైతులకు విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నాం. విద్యుత్ వినియోగదారులు పాటించాల్సిన భద్రతా సూచనలను ఆర్‌బీకేలు, పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాల వద్ద ఉంచాం.

- పి.సాల్మన్‌రాజు, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ

హెచ్‌ఎం, ఇద్దరు టీచర్లకు తాఖీదులు



ఆహార పదార్థాలను రుచి చూస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

ఏలూరు అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఒక హెచ్‌ఎం, ఇద్దరు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. శుక్రవారం కామవరపుకోట మండలం ఆడమిల్లిలోని జడ్పీ హైస్కూలును ఆకస్మికంగా డీఈవో తనిఖీ చేశారు. పాఠశాలలో మరుగుదొడ్ల నిర్వహణ, పరిసరాలు పరిశుభ్రంగాలేని కారణంగా స్కూలు రెగ్యులర్ ప్రధానోపాధ్యాయునికి, మధ్యాహ్న భోజన పథకం ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించాల్సిన బయోలాజికల్ సైన్సు ఉపాధ్యాయుని (ఇన్‌చార్జి హెచ్‌ఎం)కి, విద్యార్థుల నోట్‌బుక్స్‌ను దిద్దని కారణంగా ఫిజికల్ సైన్సు ఉపాధ్యాయునికి వివరణ ఇవ్వాల్సిందిగా తాఖీదులు జారీ చేశామన్నారు. రెగ్యులర్ హెచ్‌ఎం శుక్రవారం సెలవులో ఉన్నప్పటికీ స్కూలు రికార్డులు సరిగా లేని కారణంగా ఆయన గైర్హాజరీలో నోటీసు జారీ చేశారు. ఇక్కడి స్కూలులో భోజన పథకం ఆహారపదార్థాల నాణ్యత బాగుంటంలేదని విద్యా శాఖకు ఇప్పటికే ఫిర్యాదులందాయి. గురువారం ఎంఈవోను స్కూలు తనిఖీలకు పంపగా, శుక్రవారం డీఈవో ఆకస్మిక తనిఖీలో లొసుగులు రుజువయ్యాయి. ఆహారపదార్థాల నాసిరకంపై విద్యార్థుల నుంచి ఫిర్యాదులను డీఈవో తీసుకున్నారు. ఇకమీదట పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు జరుగుతాయని, ఎక్కడైనా విద్యార్థుల నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్ దిద్దకపోవడం, మధ్యాహ్న భోజనపథకం నిర్వహణ సరిగాలేనట్టుగా గమనిస్తే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

మైనారిటీల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ

ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్



టీడీపీ కార్యాలయంలో షరీఫ్, వలవల బాబ్జి

తాడేపల్లిగూడెం అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి):మైనారిటీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నదని ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి ఘనస్వాగతం పలికి షరీఫ్‌ను సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో షరీఫ్ మాట్లాడుతూ టీడీపీ మత సామరస్య పార్టీ అని, అన్ని మతాలను సమాన దృష్టితో చూసే పార్టీ అని కొనియాడారు. మైనార్టీలకు ఆది నుంచి తెలుగుదేశం పార్టీ అన్ని విధాలుగా పెద్ద పీటవేస్తున్నదన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారందరికి పదవులు వస్తాయని, ఇప్పటికే సగం పదవులు ఇచ్చారని, మిగిలిన వాటిలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్ర పరిపాలనలో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ తోడ్పాటు చాలా బాగుందన్నారు. రాష్ట్రానికి కొత్త ప్రాజెక్టులు వస్తున్నాయన్నారు. గొర్రెల శ్రీధర్, పట్నాల రాంపండు, దాసరి అప్పన్న, పాతూరి రాంప్రసాద్ చౌదరి, దాట్ల జగన్నాథ రాజు పాల్గొన్నారు.

వీరవాసరంలో మినీ స్టేడియం నిర్మించండి : ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం టౌన్, నవంబరు 22 (ఆంధ్ర జ్యోతి): భీమవరం నియోజకవర్గం వీరవాసరం మండలంలో పెండింగ్‌లో ఉన్న మినీ స్టేడియంను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) కోరారు. అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ 2014-19లో వీరవాసరం మండలంలో మినీ స్టేడియం ఏర్పాటుకు పునాదులు, పిల్లర్లు వేయడం జరిగిందని, గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో నిర్మాణం జరగలేదని, పట్టించుకోలేదని తెలిపారు. దీనిపై శ్రద్ధ చూపి మినీ స్టేడియం నిర్మాణం పూర్తి చేయాలని కోరారు.

గొల్లవానితిప్ప రోడ్డు లే-అవుట్‌లో విజిలెన్స్ బృందం పరిశీలన

భీమవరం, ఆంధ్రజ్యోతి :వైసీపీ హయాంలో గొల్లవానితిప్పరోడ్డును అనుకుని నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రి భవనం వద్ద లే- అవుట్‌లను విజిలెన్స్ అధికారులు పరిశీలించారు. గత ప్రభుత్వ హయాంలో అక్కడ ప్రభుత్వాసుపత్రి నిర్మాణం అవుతుందని, దాని సమీపంలో భారీ లే-అవుట్ వేశారు. సదరు లే-అవుట్ విషయంలో అప్పటి గ్రంధి శ్రీనివాస్ హస్తం ఉన్నట్టు విమర్శలు వెల్లువెత్తాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం జరిగింది. దానిపై ఇప్పుడు విజిలెన్స్ అధికారులు దృష్టి పెట్టారు. స్థానిక వీఆర్‌వో నుంచి సమాచారం సేకరించి, లే-అవుట్ పరిశీలన చేశారు. భూ వినియోగ మార్పిడి జరిగిందా లేదా అనే విషయాలపై ఆరా తీశారు. లే-అవుట్ అనుమతులపైనా వివరాలు సేకరించారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నివాసంలో ఆదాయపు పన్నుశాఖ అధికారులు తనిఖీ చేపట్టారు. కొద్దిరోజుల్లోనే గొల్లవానితిప్ప రోడ్డులోని లే-అవుట్‌ను పరిశీలించడం చర్చనీయాంశంగా మారింది.

డీఎస్సీ శిక్షణ తరగతులకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం ఎడ్యుకేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ సామాజిక వర్గాలకు చెందిన అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డిఎస్సీ - 2024 పరీక్షలకు ఉచిత శిక్షణ నిమిత్తం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బీసీ సంక్షేమ సాధికారత అధికారి జీవీఆర్‌కెఎస్ఎస్ గణపతిరావు పేర్కొన్నారు. భీమవరం కలెక్టరేట్‌లోని జిల్లా బీసీ సంక్షేమ, సాధికారిత అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. 200 మంది అభ్యర్థులకు రెండు నెలల పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందజేస్తామని తెలిపారు. బీఈడీ, టీటీసీతో పాటు ఏపీ టెట్ పరీక్షలో అర్హత సాధించాలన్నారు. అభ్యర్థులు తమ బయోడేటా, 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, బిఈడీ, టీటీసీ, టెట్ మార్కుల జాబితా, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు ఈనెల 30వ తేదీలోపు సమర్పించాలన్నారు.

చిన్న వెంకన్న రథయాత్ర



చాట్రాయి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ద్వారకా తిరుమల వెంకటేశ్వరస్వామి రథయాత్ర విస్సన్నపేట వెళుతూ కొంత సేపు చాట్రాయి సెంటర్‌లో ఆగింది. భక్తులు స్వామివారికి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

రైలు ఆపి కంటైనర్ తరలించారు..



రైల్వేగేటు నుంచి తరలిస్తున్న కంటైనర్

తాడేపల్లిగూడెం రూరల్ నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైలు ఆపి మరీ ఓ ఐఏఎస్ అధికారికి చెందిన కంటైనర్‌ను తరలించడం చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై రైల్వే అధికారులు మాత్రం విస్మయం వ్యక్తం చేశారు. తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెంలో వేరే రాష్ట్రంలో పనిచేస్తున్న ఒక ఐఏఎస్ అధికారికి చెందిన స్థలంలో నిర్మాణం చేపడుతున్నారు. ఆ నిర్మాణం కోసం ప్రత్యేకం గా తెప్పించిన కంటైనర్‌ను రైల్వేగేటు మీదుగా తరలించారు. ఈ క్రమంలో ఆ కంటైనర్ తరలించే సమయంలో గేటు వేయలేక పోవడంతో సిగ్నల్ లేక విశాఖ వైపు వెళ్తున్న రైలును మధ్యలోనే దాదాపు 15 నిమిషాలు నిలుపుదల చేయడంతో అటుగా వెళుతున్న ప్రయాణికులు, స్థానికులు వాపోయారు. సిగ్న ల్ చూసి లోకో పైలెట్ రైలు నిలుపుదల చేయకపోయి ఉంటే పెద్ద ప్రమాదమే సంభ వించేదని రైల్వే సిబ్బంది చెబుతున్నారు. ఓ గౌరవమైన ఉద్యోగం చేస్తున్న వ్యక్తి ఇలా రైలును ఆపి కంటేనర్‌లు తరలించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై నవా బుపాలెం స్టేషన్ మాస్టర్ మీనాను వివరణ కోరగా ఇలా రైలును నిలుపుదల చేసే విధంగా గేటు వేయకుండా కార్యకలాపాలు చేయడం నేరమన్నారు. ఆ కంటైనర్ గేటులోకి వచ్చి తిరిగి బయటకు వెళ్లే క్రమంలో ఆలస్యం కావడంతో ఈ సమస్య తలెత్తిందని తెలిపారు. దీన్ని ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు.

క్రైమ్ కార్నర్

కోడిపందేల స్థావరంపై దాడి

కుక్కునూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సీతారామనగరం గ్రామ శివారుల్లో కోడిపందేల స్థావరం పై పోలీసులు దాడి జరిపారు. బూర్గంపాడుకు చెందిన ఇద్దరు వ్యక్తులను, రెండుకోళ్ళు, రూ.1200 నగదును స్వాధీనం చేసుకున్నారు. కోడిపందాలు నిర్వహిస్తున్న వ్యక్తి పరారీలో ఉన్నాడు. ఈ దాడుల్లో సీఐ రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

చీటింగ్ కేసు నమోదు

ఏలూరు క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కారును అద్దెకు తీసుకుని తాకట్టుపెట్టిన ఒక యువకునిపై ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. ఏలూరు రూరల్ ప్రాంతం ఎస్‌ఎంఆర్ నగర ప్రాంతంలో నివాసం ఉంటున్న భలే గోపీకృష్ణ తన కార్లను కిరాయిలకు తిప్పుతూ ఉంటాడు. ఏలూరు పత్తేబాదనకు చెందిన ఎల్లపు భానుచందర్ మూడు రోజుల క్రితం గోపీకృష్ణ వద్ద అద్దెకు కారు తీసుకుని ఆ కారును వేరే వారికి తాకట్టు పెట్టేశాడు. మూడు రోజులు అయినా కారు ఇంకా తీసుకురావడం లేదు ఏమిటని గోపీకృష్ణ ఆరా తీయగా ఆ కారును వేరే వారికి తాకట్టు పెట్టినట్లుగా గుర్తించి ప్రశ్నించారు. ఈ సంఘటనపై ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా రూరల్ ఎస్ఐ సిహెచ్ దుర్గా ప్రసాద్ శుక్రవారం భానుచందర్‌పై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. భానుచందర్‌పై ఇదే విధంగా కార్లు అద్దెకు తీసుకుని తాకట్టు పెట్టిన కేసులు ఇటీవల నమోదు అయ్యాయి.

ఫీజు మీది.. పరీక్ష మాది !

కుక్కునూరులో ఓ ప్రైవేటు డిగ్రీ కాలేజీ సెంటర్‌లో నిర్వాకం





పరీక్షలు రాస్తున్న స్థానిక మహిళలు.. పక్కపక్కనే కూర్చుని పరీక్షలు రాస్తున్న దృశ్యం

డిగ్రీ డిస్టెన్స్ పరీక్షల్లో చూచి రాతలు

కుక్కునూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పరీక్ష ఫీజు కడితేచాలు పరిక్షా కేంద్రానికి కూడా వెళ్ళనవసరంలేదు. పరీక్ష వేరే వారితో రాయించి మన చేతిలో పాస్ సర్టిఫికెట్ పెడతారు. ఈ క్రమంలో డబ్బులు చేతులు మారతాయి. విద్యావ్యవస్థ భ్రష్టుపట్టడానికి ఇటువంటి సంఘటనలే కారణం. కుక్కునూరులోని ఓ ప్రైవేటు డిగ్రీ కాలేజీలో జరుగుతున్న డిస్టెన్స్ డిగ్రీ పరీక్షల తీరు చూసి అందరూ నివ్వెరపోయే పరిస్థితి ఏర్పడింది. పరీక్షల్లో చూచిరాతలు జరగటంతో పాటు పరీక్షలు రాయాల్సిన వారి స్థానంలో స్థానిక మహిళలు వెళ్ళి పరీక్షలు రాసినట్టు తెలుస్తోంది. అలా పరీక్షలు రాసిన మహిళలకు ఒక్కో పరీక్షకు రూ.200 చెల్లిస్తున్నారు. పుస్తకాలు పక్కనపెట్టుకుని పక్కపక్కనే కూర్చుని పరీక్షలు రాయడం గమనార్హం. వారం రోజులుగా ఇదే తరహాలో పరీక్షలు జరుగుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. పరీక్షా కేంద్రంలో సీసీ.కెమెరాలు కూడా లేకపోవడం విశేషం. కాగా స్థానిక మహిళలు పరీక్షలు రాసి బయటకు వస్తుండటం చూసి స్థానికులు నివ్వెరపోతున్నారు. స్థానికులు మీడియాకు సమాచారం ఇవ్వడంతో అసలు విషయం బయటపడింది. అధికారులు ఇప్పటికైనా ఇటువంటి వాటిపై కఠినంగా చర్యలు తీసుకోఎవాలని డిమాండ్ చేస్తున్నారు.

స్పిల్ చానల్ రోడ్డు మార్గం పునరుద్ధరణ పనులు



స్పిల్ చానల్‌లో రోడ్డు మార్గం పనులు చేస్తున్న దృశ్యం

పోలవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో స్పిల్ ఛానల్‌లో రోడ్డు మార్గం పునరద్ధరణ పనులను శుక్రవారం అధికారులు ప్రారంభించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో అతికీలకమైన డయాఫ్రంవాల్, ఎర్త్‌కం రాక్ ఫిల్ డ్యాం నిర్మాణాలకు అవసరమయ్యే మట్టి రాయి, మెటీరియల్ తరలింపు కోసం 902 హిల్ ప్రాంతం నుంచి మహానందీశ్వరస్వామి ఆలయం వరకూ కిలోమీటరు పొడవునా స్పిల్ ఛానల్ మీదుగా గతంలో నిర్మించిన రోడ్డు మార్గం గడిచిన వరదలకు స్పిల్‌వే నుంచి విడుదలైన వరద జలాల తాకిడికి పలుచోట్ల కొట్టుకుపోయింది. డయాఫ్రంవాల్, ఎర్త్‌కం రాక్ ఫిల్ డ్యాం ప్రాంతానికి మట్టి రాయి మెటీరియల్ వాహనాల రాకపోకలు పునరుద్ధరించేందుకు రోడ్డు మార్గం పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు ఈఈ పి.వెంకటరమణ తెలిపారు.

మట్టి తరలింపు పనులు వేగవంతం



పోలవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నుంచి మూలలంకకు మట్టి తరలింపు పనులను అధికా రులు శుక్రవారం వేగవంతం చేశారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే దిగువన కుడివైపు స్పిల్ చానల్ ప్రొటెక్షన్ వాల్‌కి సమీపంలో గతంలో డంపింగ్ చేసిన మట్టి వర్షాలు, స్పిల్‌వే వరద తాకిడికి స్పిల్ చానల్‌లోకి అండలుగా మట్టి జారిపడుతున్నది. ఇదే పరిస్థితి కొనసాగితే మట్టి స్పిల్ ఛానల్‌లోకి పూర్తి స్థాయిలో జారి స్పిల్ ఛానల్‌లో సిల్టు పెరిగిపోయే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు ఆ ప్రాంతంలో ఉన్న మట్టి డంపింగ్‌ని మూలలంక డంపింగ్ ప్రాంతానికి తరలించే పనులు వేగవంతంగా చేస్తున్నారు. హెవీ లోడ్ వలన మట్టి స్పిల్ ఛానల్‌లోకి జారుతుందని, ముందస్తు చర్యగా మట్టిని మూలలంకకు తరలిస్తున్నట్లు ఈఈ పి.వెంటరమణ తెలిపారు.

భార్య, కుమార్తె ఆత్మహత్య కేసులో భర్తకు పదేళ్ల జైలు

ఏలూరు క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : భర్త వేధింపులు భరించలేక ఒక మహిళ తన కుమార్తెతో సహా రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు నేరం రుజువు కావడంతో భర్తకు పది సంవత్సరాలు జైలు శిక్ష, ఐదు వేల రూపాయల జరిమానా విధిస్తూ ఏలూరులోని ఐదవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి జి రాజేశ్వరి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం లింగపాలెం మండలం బాదరాల గ్రామానికి చెందిన ప్రభావతికి అదే గ్రామానికి చెందిన దొండపాటి కోటేశ్వరరావుతో 2010లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రభావతి తల్లి చిన్ననాడే మరణించగా తండ్రి వేరే వివాహం చేసుకుని వెళ్ళిపోయాడు. ఆమె మేనమామ పెంచి పెద్ద చేసి వివాహం చేశాడు. దొండపాటి కోటేశ్వరరావుకు వివాహం కాకముందు నుంచే మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని వివాహం చేసుకున్న ప్రభావతిని శారీరకంగా మానసికంగా వేధించాడు. పెద్దలో పలుమార్లు పెట్టి నచ్చజెప్పినా ఏమాత్రం మార్పులేదు. తాను చనిపోతే తన ఇద్దరు పిల్లలు అనాథలు అవుతారని భావించిన ప్రభావతి 2016 ఏప్రిల్ 13వ తేదీన ఏలూరు సమీపంలోని వట్లూరు కోళ్ళఫారాల షెడ్ల దగ్గరలో రైలు పట్టాలపై ప్రభావతి తన ఇద్దరు పిల్లలను తీసుకుని రైలు కింద పడింది. ఈ సంఘటనలో తల్లి కుమార్తె మరణించగా కుమారుడు ప్రాణాలతో ఉండడంతో సమీపంలో వారు వెళ్ళి ఆ బాలుడిని కాపాడారు. ఈసంఘటనపై ఏలూరు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి ఈ కేసును ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో కోర్టు శిక్ష విధించింది. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ డీవీ రామాంజనేయులు వాదించగా ప్రాసిక్యూషన్‌కు ధర్మాజీగూడెం ఎస్ఐ వెంకన్న, కానిస్టేబుల్ రవి, కోర్టు మానిటరింగ్ సెల్ హెడ్‌కానిస్టేబుల్ మూర్తి, ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు సహకరించారు.

యూరియా లోడు లారీ దగ్ధం



తాడేపల్లిగూడెం రూరల్ నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మెట్టఉప్పరగూడెంలో లారీ వైర్లు షార్ట్ కావడంతో యూరియా లోడు దగ్ధమైన ఘటన శుక్రవారం చోటు చేసుకున్నది. మెట్టఉప్పరగూడె ంలో ఎం.చంద్రశేఖర్‌కు చెందిన ఈ లారీ దగ్ధం కావడంతో రూ.3లక్షలు ఆస్తి నష్టం వాటిల్లినట్టు అగ్నిమాపక అధికారి రామారావు తెలిపారు.

చికెన్ వ్యర్థాలతో వాహనం పట్టివేత

పెదపాడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు కోళ్ల వ్యర్థాలను తరలిస్తుండగా దాడి చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లుగా పెదపాడు ఎస్సై కట్టా శారదా సతీశ్ తెలిపారు. వాహన యజమానితో పాటుగా డ్రైవర్‌పై కేసు నమోదు చేసి చికెన్ వ్యర్థాలను గొయ్యి తీసి పూడ్చి పెట్టించినట్లుగా చెప్పారు. పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాటిచెట్టు పడి రైతు మృతి

ఇద్దరికి గాయాలు



పోతురాజు (ఫైల్)

పెదవేగి, నవంబరు 22 (ఆంధ్ర జ్యోతి): ఎక్స్‌కవేటర్‌తో పొలంలో పని చేయిస్తుండగా ప్రమాదవశాత్తు తాటిచెట్టు మీద పడి ఒక వ్యక్తి మృతిచెందగా, మరో ఇద్దరు గాయాలపాలయ్యారు. పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. పెదవేగి మండలం నడిపల్లికి చెందిన మట్టా పోతురాజు శుక్రవారం మధ్యాహ్నం తన పొలంలో ఎక్స్‌కవేటర్‌తో పని చేయిస్తున్నాడు. పంట సాగుకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగిస్తుండగా తాటి చెట్టు ఒక్కసారిగా అక్కడే ఉన్న వ్యక్తులపై పడింది. ఈ ప్రమాదంలో మట్టా పోతురాజు(65) తీవ్రంగా గాయపడగా ఏలూరు ఆస్పత్రికి తీసుకెళ్ళగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా అక్కడే పని చేస్తున్న మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. దీనిపై కేసునమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

సీఎం సహాయనిధికి రేషన్ డీలర్ల వితరణ

ఏలూరు రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి):ఎన్టీఆర్ జిల్లా వరద బాధితుల కోసం సీఎం సహాయనిధికి ఏలూరు జిల్లా రేషన్‌డీలర్ల సంక్షేమ సంఘం ద్వారా నవంబరు నెల కమిషన్ నుండి 15 శాతం అందచేసినట్లు జిల్లా రేషన్ డీలర్ల అసోసియేషన్ నాయకులు రాజుల పాటి గంగాధర్‌గౌడ్, అత్తులూరి ఉదయేశ్వరరావు తెలిపారు. నవంబర్ నెల డీలర్ల కమిషన్ రూ.11 లక్షల 98 వేల 201లను సీఎం సహాయనిధికి రాష్ట్ర పౌరసరఫరాల కమిషన్ ద్వారా జమ చేసినట్లు వారు తెలిపారు.

నేడు మునిసిపల్ వర్కర్ల యూనియన్ సమావేశం

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా సర్వసభ్య సమావేశం శనివారం జంగారెడ్డిగూడెం లయన్స్ క్లబ్ హాలులో జరుగుతుందని, సమావేశాన్ని జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా కార్యదర్శి భజంత్రి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మునిసిపల్ కార్మికుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు.

నేడు, రేపు ఓటర్ల నమోదు ప్రత్యేక కార్యక్రమం

కామవరపుకోట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మండలంలోని 49 పోలింగ్ కేంద్రాల వద్ద ఈ నెల 23, 24 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బూత్ లెవల్ అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద ఉంటారని, ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ గెడ్డం ఎలీషా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు. ఈ కేంద్రాల వద్ద అర్హులైన వారు 6, 7, 8 ఫారాలను పూర్తి చేసి అందచేయవచ్చునని చెప్పారు.

వాటర్ ప్లాంట్‌కు శంకుస్థాపన

చింతలపూడి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పట్టాయిగూడెంలో మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి గ్రామ టీడీపీ నాయకుడు సూరానేని గోపి శంకుస్థాపన జరిపారు. గోద్రెజ్ ఆయిల్‌పాం, వేగేశ్న ఫౌండేషన్ సౌజన్యంతో ప్లాంట్ నిర్మాణం జరుగుతుందన్నారు. గ్రామానికి చెందిన ఐదుగురు పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ చెక్కులను గోద్రెజ్ కంపెనీ అధికారి సౌగత్ నియోగి పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు జగ్గవరపు ముత్తారెడ్డి పాల్గొన్నారు.

నేడు గాయత్రి ఆలయంలో పూజలు

ఉంగుటూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): చేబ్రోలు సాయి గాయత్రి ఆలయంలో సత్యసాయి జయంతి సందర్భంగా శ్రీ సాయి గాయత్రి అమ్మవారికి శనివారం విశేష అభిషేకం, కుంకుమార్చన నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు వివరించారు. అనంతరం భక్తులకు కార్తీక వనసమారాధన జరుగుతుందని ప్రకటనలో తెలిపారు.

రేపు వామపక్షాల సదస్సు

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి):విద్యుత్ చార్జీల పెంపుదలకు నిరసిస్తూ ప్రజల, వాణిజ్య సంస్థల ప్రతినిధులతో రామచంద్రరావుపేటలోని శ్రీ కాశీ విశ్వేశ్వర కళ్యాణ మండపం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సదస్సును నిర్వహిస్తున్నట్టు వామపక్షాల నాయకులు బి.వెంకటేశ్వరరావు, పి.కిషోర్ తెలిపారు. వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, విద్యుత్ వినియోగదారులు అభిప్రాయాలను తెలియచేయాలని పేర్కొన్నారు

26 కలెక్టరేట్ వద్ద మహాధర్నా

పోలవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఈ నెల 26న ఏపీ ఏజన్సీ గిరిజన సంఘం, రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో జరగనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి షేక్ బాషా పిలుపునిచ్చారు. శుక్రవారం పోలవరంలో ఉభయ సంఘాల సభ్యులతో ర్యాలీ నిర్వహించి నినాదాలు చేసారు. ఏజన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు, మిడియం రవిదొర, మడకం పోశమ్మ తదితరులు పాల్గొన్నారు.

25న ఐఎంఎఫ్ఎల్ డిపో వద్ద వేలం

ఏలూరు క్రైం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎపిఎస్‌బిసిఎల్, ఐఎంఎఫ్ఎల్ డిపో, ఏలూరు పరిధిలోని వివిధ ప్రభుత్వ మద్యం షాపులకు చెందిన వస్తువులు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఏలూరు డిపో మేనేజర్ ఆధ్వర్యంలో ఎపిఎస్ బిసిఎల్, ఏలూరు డిపో వద్ద వేలం వేస్తామని డిపో మేనేజర్ కె వెంకట్రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 108 ఫ్రీజర్లు, 126 ఇన్వర్టర్లు, బ్యాటరీలు, 110 క్యాష్ చెస్టులు, 248 స్కానర్లు , 120 క్యాష్ కౌంటింగ్ మిషన్లకు ఈనెల 25న ఏలూరులో ఉన్న ఐఎంఎఫ్ఎల్ డిపో వద్ద వేలం వేయడం జరుగుతుందన్నారు. వేలంలో పాల్గొనే వారు సమాచారం కోసం డేటా ఎంట్రీ ఆపరేటర్ సెల్‌నెంబర్ 99662 545446 లేదా అసిస్టెంట్ మేనేజర్ 80081 23152, డిపో మేనేజర్ 95507 96439 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఇతర పనులు అప్పగించవద్దు

పెదవేగి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రేడ్-3 ఏఎన్ఎంలకు వైద్య, ఆరోగ్యశాఖతో సంబంధం లేని పనులు కేటాయించారని, దీంతో వారు పని ఒత్తిడికి గురౌతున్నారని, దీని నుంచి విముక్తి కల్పించాలని కోరుతూ గ్రేడ్-3 ఏఎన్ఎంలు మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో పెదవేగి ఎంపీడీవో పి.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు బట్టు విజయవర్ధన్‌బాబు మాట్లాడుతూ వైద్యేతర పనులు కేటాయించరాదని ఆదేశాలు ఉన్నాయని ఎంపీడీవోకు విన్నవిం చారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

ఏలూరు రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):ఏలూరు ప్రాజెక్టు పరిధిలోని తంగెళ్ళమూడి ఎంపీయూపీ పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.ఎ.వి.ఎల్ పద్మావతి శుక్రవారం సందర్శించారు. పాఠశాల ఆవరణలో సపోట, జామ, మామిడి, అరటి తదితర మొక్కలునాటి నీరుపోశారు.

ఏఈ సెలవు.. అభివృద్ధి పనులకు బ్రేక్

» నిలిచిన రూ. 2 కోట్ల పనులు » వెంటనే ప్రారంభించాలంటున్న కౌన్సిలర్లు, ప్రజలు



మున్సిపల్ కార్యాలయం వద్ద మధ్యలో నిలిచిన కల్వర్టు

జంగారెడ్డిగూడెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులకు నిధులు మంజూరై, టెండర్ల ప్రక్రియ పూర్తయినా పనులు ముందుకు సాగని పరిస్థితి జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలో నెలకొంది. మునిసిపల్ ఏఈ సెలవులో ఉండడంతో పట్టణంలో జరగాల్సిన ఇరవై పనులకు సంబంధించి సుమారు రూ. రెండు కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం కాకుండానే నిలిచిపోయాయి. ఇప్పటికే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో కొత్త పనులు ప్రారంభించడానికి వీలు లేకపోవడంతో పాత పనులను పూర్తిచేయాలని ఆశించారు కానీ అవి కూడా కొద్ది రోజులుగా నిలిచిపోవడంతో పలు అంతర్గత రహదారులు, డ్రైన్లు, కల్వర్టులు, పైప్‌లైన్ పనులు ప్రారంభం కాక ప్రజలు, ఆయా వార్డుల కౌన్సిలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు, డ్రైన్లు, ఇతర పనులకు సంబంధించి అంచనాలు వేయడం నుంచి పనులు పూర్తయ్యే వరకు మున్సిపల్ ఏఈ పర్యవేక్షణ ఉండాలి. పూర్తయిన పనులకు సంబంధించి ఎం బుక్ చేయడం, కాంట్రాక్టర్లకు చెందిన బిల్లులను సిఎఫ్ఎంఎస్ లో అప్‌లోడ్ చేసే పనులన్నీ ఏఈ నిర్వహించాలి. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ ఏఈ గా పనిచేసిన సంధ్యారాణి ఏలూరు కార్పొరేషన్‌కు బదిలీపై వెళ్ళగా గుడివాడ నుంచి జ్వాలా దీప్తి గత నెల 16న బాధ్యతలు స్వీకరించారు. విధుల్లో చేరిన 20 రోజుల్లోనే ఆమె 3 నెలల పాటు సెలవుపై వెళ్లారు. దీంతో పట్టణంలో అభివృద్ధి పనులన్నీ నిలిచిపోయాయి.

కమిషనర్ ఏమన్నారు..?

ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ కె. వెంకట రమణను వివరణ కోరగా మరో ఏఈను ఇన్‌చార్జిగా నియమించాలని పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈని కోరామన్నారు. ఇన్‌చార్జి ఏఈను నియమించగానే పనులను వెంటనే ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మరొకరిని ఇన్‌చార్జి ఏఈగా నియమించి పట్టణంలో అభివృద్ధి పనులను ప్రారంభించాలని ఆయా వార్డుల మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజలు కోరుతున్నారు.

రోగక నిరోధక శక్తిని పెంచుకోవాలి : కలెక్టర్



వైద్య కళాశాలలో వరల్డ్ ఎఎంఆర్ అవేర్‌నెస్‌వీక్‌లో పాల్గొన్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రోగ నిరోధక శక్తిని పెంచుకుని భవిష్యత్‌ను కాపాడుకోవచ్చని జిల్లా కలెక్టర్ కె వెట్రిసెల్వి అన్నారు. శుక్రవారం ప్రభుత్వాసుపత్రిలో ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల ఆధ్వర్యంలో వరల్డ్ ఏఎంఆర్ అవేర్‌నెస్ వీక్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ డాక్టరుని సంప్రదించకుండా స్వయంగా మందులు వినియోగించవద్దని హితవు పలికారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్‌రాజు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్ శర్మిష్ట, డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్‌సతీష్‌కుమార్, ఆర్ఎంవో డాక్టర్ డి దుర్గాకుమార్, మైక్రోబయాలజీ హెచ్‌వోడీ డాక్టర్ ఎం శశిధర్, ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ సావిత్రి, వైద్య కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా నిర్వహించాలి



వ్యవసాయాధికారులతో మాట్లాడుతున్న పౌరసరఫరాల సంస్థ ఎండీ జిలానీ సామూన్

భీమడోలు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను పౌరసరఫరాల శాఖ వైస్‌చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జిలానీ సామూన్ ఆదేశించారు. శుక్రవారం పోలసానపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అంబర్‌పేటలోని శ్రీదుర్గా ఆగ్రో ఇండస్ట్రీస్‌ను, పాతూరులోని ఎస్ఎల్‌సి పాయింట్‌ను జాయింట్ కలెక్టర్ కె ధాత్రిరెడ్డితో కలసి పరిశీ లించారు. తొలుత జిల్లాకు విచ్చేసిన ఆయనకు జేసీ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సమీపంలో తమ ఇష్టమైన మిల్లులకే ధాన్యాన్ని తరలించుకునే వెసులుబాటు కల్పించామన్నారు. ఇంతవరకూ 136.44 కోట్ల విలువైన 68164 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. పాతూరు ఎంఎల్‌సీ పాయింట్‌ను తనిఖీ చేసిన ఆయన చౌకధరల దుకాణం ద్వారా సరైన తూకానికి పంపిణీ చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి రైతులకు పంపిణీ చేస్తున్న గోనె సంచులను ఆయన పరిశీలించారు. వాటిలో కొన్ని సరిగా లేవని వెనక్కి పంపించాలని ఆదేశించారు. సివిల్ సప్లై జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు పరిశీలించిన జేసీ

చింతలపూడి: రేచర్ల, మల్లాయగూడెం, పోతునూరు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మిల్లులను జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి శుక్రవారం పరిశీలించారు. రేచర్ల మిల్లులో ధాన్యం ఎంత కొనుగోలు చేశారు.. తేమశాతం యంత్రాలను పరిశీలించారు. పోతునూరు రైతు సేవా కేంద్రం సొసైటీలో కొనుగోలును పరిశీలించి ధాన్యం లారీ లోడు పూర్తి కాకుండానే ట్రక్‌షీట్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఇందులో మధ్యవర్తుల ప్రమేయం పై విచారణ చెయ్యాలని డీఎస్‌ఓ ఆర్ఎస్ఎస్ సత్యనారాయణ రాజును ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్ ప్రమద్వర, సిబ్బంది పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారానికే పోలీస్ సంక్షేమ దివస్ : ఎస్పీ

ఏలూరు క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పనిచేస్తున్న సివిల్ ఏఆర్ పోలీసులు, హోంగార్డుల సమస్యల పరిష్కారానికి జిల్లా ఎస్పీ కెపిఎస్ కిషోర్ శుక్రవారం ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ సిబ్బంది సంక్షేమ దివస్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. త్వరితగతిన పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

వైద్యుల బదిలీలు నిలిపివేయాలి

ఏలూరు క్రైం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో డిప్యుటేషన్‌పై పని చేస్తున్న ఐదుగురు వైద్యుల బదిలీలను వెంటనే నిలుపుదల చేయాలని ఏఐటీయూసీ ఏలూరు నగర సమితి అధ్యక్షులు కె.కృష్ణమాచార్యులు ఒక ప్రకటనలో కోరారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న వారిని వారి స్థానంలో వేరే వైద్యులను నియమించిన తరువాతే బదిలీ చేయాలని అప్పటి వరకూ వీరి సేవలు కొనసాగేలా జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలని కోరారు.

బీమాను ప్రభుత్వమే చెల్లించాలి

ఏలూరు రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రబీ పంటల బీమా ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని రాష్ట్ర రైతు సంఘం జిల్లా నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషాకు సంఘ నాయకులు వినతిపత్రం అందచేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కర్‌రావు, కార్యదర్శి కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సీతప్పగూడెంలో ధర్నా

హామీలు అమలు చేయాలి

బుట్టాయగూడెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం సీతప్పగూడెం గ్రామ సచివాలయం వద్ద నాయకులు, ఆదివాసీలు ధర్నా నిర్వహించారు. అనంతరం సచివాలయ ఉద్యోగికి వినతిపత్రం అందజేశారు. డివిజన్ కార్యదర్శి కారం దారయ్య మాట్లాడుతూ అధికారంలోకి వస్తే కూటమి ప్రభుత్వం పేద గిరిజనులకు ఏజెన్సీ ప్రాంతంలో మూడు సెంట్ల ఇళ్ళ స్థలాన్ని, పట్టణ ప్రాంతంలో రెండు స్థలాల ఇళ్ళ స్థలాలను ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడులు

ఏలూరు క్రైం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.ఆవులయ్య ఆధ్వర్యంలో జిల్లాలోని నూజివీడు, చింతలపూడి, పోలవరం, జంగారెడ్డిగూడెం, చాట్రాయి, కుక్కునూరు, బుట్టాయిగూడెం మండల గ్రామాల్లో విస్తృతంగా శుక్రవారం దాడులు నిర్వహించి 37 కేసులు నమోదు చేశారు. 29 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి 74 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. వారి నుంచి 17 వేల 703 లీటర్ల బెల్లపు ఊటను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. జిల్లాలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న కేంద్రాలపై దాడులు చేసి 324 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. రాబోయే పండుగలను దృష్ట్యా సారా కేంద్రాలపై దృష్టిసారించి విస్తృతంగా దాడులు నిర్వహిస్తామని నాన్ డ్యూటీపెయిడ్ లిక్కర్, గంజాయి అమ్మకాలు, నల్లబెల్లం, డ్రగ్స్ అమ్మకందారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలో నేరానికి పాల్పడిన వారు అనుమానితులపై బిఎన్ఎస్ చట్టం 128, 129 సెక్షన్ల ప్రకారం 25 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసి మండల తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేయించామన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీలత ఆదేశాల మేరకు యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందని నల్లబెల్లం వ్యాపారులు, సారా తయారీ దారులకు బెల్లం విక్రయించకుండా ఉండేందుకు వారికి నోటీసులు జారీ చేయడం జరుగుతుందని ప్రకటనలో తెలిపారు.

క్రైమ్ కార్నర్

జగన్‌పై దుష్ప్రచారం.. కేసు నమోదుకు దూలం ఫిర్యాదు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసిన టీడీపీ నేతలపై కేసు నమోదు చేయాలని వైసీపీ ఏలూరు జిల్లా అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు ఏలూరు టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఈ మేరకు ఎస్ఐ దానంకు ఫిర్యాదును అందించారు. చింతలపూడి సమన్వయకర్త కంభం విజయరాజు, ఏలూరు సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

ఏలూరు యాదవ్‌నగర్‌కు చెందిన గవ్వల పాలెం నాగమహేష్ (21) మానసిక స్థితి సరిగా ఉండదు. అతని అమ్మమ్మ నరాల నాగమణితో కలిసి ఈ నెల 21 కబడ్డీ గూడెం సెంటర్‌కు వెళ్లి అదృశ్యమయ్యాడు. అతని కోసం వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో ఏలూరు టూటౌన్ పోలీసులకు నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత

పెదపాడు: చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు కోళ్లవ్యర్థాలను తరలిస్తుండగా సిబ్బందితో దాడి చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లుగా పెదపాడు ఎస్సై కట్టా శారద సతీష్ తెలిపారు. వాహన, యజమానితోపాటు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి చికెన్ వ్యర్థాలను భూమిలో పూడ్చి పెట్టినట్టు ఎస్సై సతీష్ చెప్పారు. పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలవరం నిర్వాసితులకు న్యాయం చేస్తాం : ఎంపీ



ఎంపీ నుంచి శాశ్వత సభ్యత్వం అందుకుంటున్న టీడీపీ మండల అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు

ఏలూరు టూ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పూర్తి న్యాయం చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఎంపీ కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చేవారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి నిర్వాసితులకు సంబంధించి నివేదిక సమర్పిస్తామన్నారు. ఆయుధ కర్మాగారాన్ని జీలుగుమిల్లి మండలంలోనే ఏర్పాటు చేస్తామని, అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. ఏలూరును పారిశ్రామికవాడగా తీర్చిదిద్దటమే తన లక్ష్యమన్నారు. యువతకు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించటమే లక్ష్యంగా మంత్రి నారా లోకేశ్ శక్తివంచనలేకుండా కృషి చేస్తున్నారని అన్నారు. దీనిలో భాగంగానే 65వేల కోట్లతో రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పేదుకు రిలయన్స్ ముందుకు వచ్చిందన్నారు. పంచాయతీ రాజ్ రహదారుల అభివృద్ధికి ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గానికి 100కోట్లు కేటాయిం చేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సాను కూలత వ్యక్తం చేశారన్నారు. ఈ నెల 25నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో రైతులు, యువత మహిళలు అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి అభివృద్ధికి అవసరమైన నిధులు రాబట్టేందుకు పార్లమెంట్‌లో ప్రస్తావిస్తామని అన్నారు.

శాశ్వత సభ్యత్వానికి అనూహ్య స్పందన..

టీడీపీ శాశ్వత సభ్యత్వ నమోదుకు అనూహ్య స్పందన లభించినందుకు ఆనందంగా ఉందని ఎంపీ అన్నారు. శుక్రవారం 20 మంది ఒక్కొక్కరు లక్ష రూపాయలు చొప్పున చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారని అన్నారు.

కుక్కునూరు: కుక్కునూరు టీడీపీ మండల అధ్యక్షుడు లక్ష రూపాయలు చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. శుక్రవారం ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ నుంచి సభ్యత్వ నమోదు పత్రాన్ని ములిశెట్టి నాగేశ్వరరావు అందుకున్నారు. కుక్కు నూరు మండలంలో సభ్యత్వాలు అధిక సంఖ్యలో జరుగుతున్నాయని ఎంపీకి తెలిపారు. ఉప సర్పంచ్ పిచ్చుక రాజు, చుంచు సత్యనారాయణ, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

'కుడిపూడి'కి సత్కారం



జంగారెడ్డిగూడెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ శెట్టిబలిజ సంక్షేమ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా కుడిపూడి సత్తిబాబు శుక్రవారం విజయవాడ గొల్లపూడి బీసీ సంక్షేమ భవనంలో ప్రమాణ స్వీకారం చేశారు. జంగారెడ్డిగూడేనికి చెందిన టీడీపీ నాయకుడు, ఏపీ శెట్టిబలిజ సంక్షేమ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ చిట్టిబోయిన రామ లింగేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్‌చంద్రశేషు ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు భారీగా తరలివెళ్ళారు. ప్రమాణ స్వీకారం అనంతరం కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్, కుడిపూడి సత్తిబాబును, రామలింగేశ్వరరావును సత్కరించారు. క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ రామచంద్రరాజు, కొండేటి కిషోర్, టీడీపీ నాయకులు కొంచాడ ఉమాప్రసాద్, కోనేటి చంటి, ఎన్.జగత్,కొప్పుల దొరబాబు,గుమ్మడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద వలంటీర్ల ధర్నా

ఏలూరు రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఏపీ గ్రామ వార్డు వలంటీర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు వలంటీర్లను కొనసాగిస్తామని జీతం రూ.10వేలు పెంచుతామని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చాక మాట తప్పిందన్నారు. ఆరునెలల పెండింగ్ జీతాలు విడుదల చేసి ఉద్యోగ భద్రత కల్పించి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వలంటీర్స్ యూనియన్ నాయకులు పృథ్వీరాజ్, విజయ్, తన్మయ్‌అశోక్, మణికంఠ, హర్షలత పాల్గొన్నారు. అనంతరం డీఆర్వోను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఘనంగా ఫాదర్ బాల జన్మదిన వేడుకలు



దెందులూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల డెంటల్ కళాశాల ఆసుపత్రి అభివృద్ధికి ఫాదర్ పి. బాల కృషి మరువలేనిదని ఏలూరు ఆర్‌సీఎం చర్చి(పీఠాధిపతి) పొలిమేర జయరావు అన్నారు. శుక్రవారం సోమవరప్పాడులోని సెయింట్ జాన్స్ డీఈడీ, బీఈడీ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి బాల జన్మదిన వేడుకలు డెంటల్ కాలేజీ కరస్పాండెంట్ ఫాదర్ మోజెస్, అంబికా సంస్థల చైర్మన్ అంబికా రాజా, ఫాదర్ మైఖేల్, ఫాదర్ బాబు జార్జి, ఇమాన్యుయల్, బిషప్ సెక్రటరి రాజు ఆధ్వర్యంలో జరిగాయి. పేదలకు దుస్తులు, పండ్లను పంపిణీ చేశారు. డెంటల్ కాలేజీ పీడీ నల్లయ్య పేదలకు అన్నదానం చేశారు.



టీడీపీ మండల అధ్యక్షుడి పుట్టినరోజు వేడుకలు

ద్వారకాతిరుమల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు లంకా సత్తిపండు పుట్టినరోజు వేడుకలను మండల పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. వైష్ణవి హోటల్‌లో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మద్రాస్ రాము, పోలిన శ్రీను, ఇమ్మడి రత్నాజీ, ఏపూరి దాలయ్య, గువ్వల మావుళ్లు, నరం త్రిమూర్తులు, బొట్ల సాయి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ రిప్‌లకు కనీస వేతనం అమలు చేయాలి

ఏలూరు రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కార్మికులకు నష్టం చేసే లేబర్‌కోడ్‌లను రద్దుచేయాలని, మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్‌లకు కనీస వేతనం అమలు చేయాలని, ఏపీ మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో డీఆర్వో వి.విశ్వేశ్వరరావు కలిసి ఢిల్లీలో జరుగుతున్న ధర్నాకు మద్ధతుగా శుక్రవారం సాయంత్రం వినతిపత్రం అందచేశారు. యూనియన్ అధ్యక్షుడు టీవీ సత్యనారాయణ మాట్లాడుతూ మందులపై జీఎస్టీ ఎత్తివేయాలని, కనీసవేతనాలు అమలు చేయాలని, పార్మారంగంలో కార్మికచట్టాలను అమలు చేయాలని తదితర డిమాండ్‌లతో ఢిల్లీలో యూనియన్ ఆధ్వర్యంలో మహా ధర్నా జరుగుతుందని తెలిపారు.

హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలి

టి.నరసాపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జనవరి 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావాన్ని విజయవంతం చేసి హిందువులు ఐక్యత చాటుకోవాలని సమరసత సేవా ఫౌండేషన్ ఏలూరు జిల్లా కన్వీనర్ టి. రామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక శివాలయం కల్యాణ మండపంలో జరిగిన హైందవ శంఖారావ సభలో ఆయన మాట్లాడారు. ధర్మదాయశాఖను రద్దుచేసి ఆలయ నిర్వహణను ధార్మిక సంస్థలకు అప్పగించాలని కోరారు. శిథిలావస్థలో ఉన్న అనేక రామాలయాలకు శివాలయాలకు హిందువుల సొమ్ముతో బాగు చేయించాలన్నారు. జనవరి 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావసభకు ప్రతి గ్రామం నుండి కూడా హిందువులు రావాలని పిలుపునిచ్చారు.

వ్యవసాయ విద్యార్థుల క్షేత్రసాయి పరిశీలన

పెదవేగి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విద్యార్థుల క్షేత్రస్థాయి పరిశీలన భవిష్యత్‌లో వారికి ఎంతో ఉపయోగకరమని ఏలూరు ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కె.ఫణికుమార్ అన్నారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విద్యాలయం అనుబంధ మార్కాపురంలోని ఎస్ఎస్ వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థులు పెదవేగి మండలం కొప్పాకలో శుక్రవారం గ్రామీణ కృషి అనుభవ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఫణికుమార్ గ్రామీణ ప్రాంతంలో సాగు పరిస్థితులు, రైతులు తీసుకునే యాజమాన్య పద్ధతులు, విధానాలు, ఎరువుల యాజమాన్యం వంటి వాటిపై వ్యవసాయ విద్యార్థులకు అవగాహన కల్పించారు.

విద్యార్థుల సమగ్రాభివృద్ధికి చర్యలు

పెదపాడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు పెదపాడు ఎంఈవో నబ్బితి నరసింహమూర్తి తెలిపారు. పాఠశాల పనిగంటలు మార్పు చేసి పైలట్ ప్రాజెక్టుగా గుర్తించిన కలపర్రు జడ్పీ హైస్కూల్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. బోధనా విధానాలు పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి వారి విషయ పరిజ్ఞానాన్ని తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్నం భోజన నాణ్యతను పరిశీలించారు. ఎంఈవో నరసింహమూర్తి మాట్లాడుతూ నూరుశాతం ఫలితాల సాధనకై తగు ప్రణాళికలతో ముందుకెళుతున్నామన్నారు.

మత్తు పదార్థాల జోలికి వెళొద్దు

ఏలూరు రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాలు, సోషల్ మీడియా జోలికి వెళ్ళవద్దని నవజీవన్ బాలభవన్ బోస్కో డిఅడిక్షన్ సెంటర్ ప్రోగ్రామ్ మేనేజరు జక్కుల అంజనేయులు అన్నారు. శుక్ర వారం పోణంగి జడ్పీ హైస్కూల్లో నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై అవగాహన కల్పించారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

ఏలూరు అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : భీమడోలులోని సీబీసీఎన్‌సీ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో ఎయిడెడ్ ఎస్జీటీ పోస్టుల భర్తీకి అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ తేదీని ఈ నెల 30వరకు పొడిగించినట్టు డీఈవో వెంకటలక్ష్మి తెలిపారు. అర్హులైన అభ్యర్థులు అకడమిక్, ప్రొఫెషనల్ ధ్రువీకరణ పత్రాల ఫోటోస్టాట్ కాపీలతో సంబంధిత స్కూలులోగాని, పోస్టుద్వారా గాని, ఆన్‌లైన్‌లో సీఎస్‌ఈ వెబ్‌సైట్ ద్వారాగాని నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఇంటింటా లార్వా సర్వే

ఏలూరు అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : దోమల నిర్మూలనపై శుక్రవారం స్థానిక శనివారపుపేట సచివాలయ పరిధిలోని శ్రీరామ్ నగర్‌లో మలేరియా విభాగం అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. దోమకాటువల్లే ఎక్కువ శాతం వ్యాధులు సంభవిస్తున్నాయని, పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు పాటిస్తే దోమల నిర్మూలన సాధ్యమని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రసాద్ సూచించారు. మంచినీళ్లను వారానికి పైబడి నిల్వ ఉంచితే డెంగీ, మలేరియా దోమలు వృద్ధి చెందుతాయని వివరించారు. ర్యాలీ అనంతరం ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వేలను నిర్వహించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆర్జిత సెలవులకు అనుమతి

ఏలూరు అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వేసవి సెలవుల్లో 2022 నుంచి 2024వరకు నిర్వహించిన పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల విధుల్లో పాల్గొన్న బోధన, బోధనేతర సిబ్బందికి ఆర్జిత సెలవులను అనుమతిస్తూ విద్యాశాఖ ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారని వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు అంజనేయులు, కృష్ణ, రత్నంబాబు, మోహన్, స్టీవెన్ తదితరులు ఓ ప్రకటనలో తెలిపారు.

టూల్ కిట్ల పంపిణీ

చింతలపూడి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత మహిళలు కుట్టు, ఎంబ్రాయిడరీలో శిక్షణ పొంది ఉపాధి పొందాలని ఎపీయుడబ్ల్యుజె జిల్లా ఉపాధ్యక్షుడు ఆజాద్ అన్నారు. కేంద్ర హస్త కళల శాఖ సహకారంతో గురు శిష్య హస్త శిల్పి ప్రశిక్షణ్ కార్యక్రమంలో శిక్షణ పొందిన 30 మంది మహిళలకు ట్రైనింగ్ సెంటర్‌లో టూల్ కిట్‌లను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అందచేశారు. శిక్షకుడు కె.రాజేష్, సత్యవేణి, లబ్దిదారులు పాల్గొన్నారు.

జెట్టికి పలువురి అభినందన

టి.నరసాపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన జెట్టి గురునాథరావుకు ఆ పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి కురసం నిరీక్షణరావు, యూత్ నాయకులు శుక్రవారం జంగారెడ్డిగూడెంలో ఆయన స్వగృహంలో కలసి అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.

వృద్ధులకు రగ్గుల వితరణ

కామవరపుకోట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : షేర్ అండ్ కేర్ సంస్థ ఆధ్వర్యంలో 15 మంది వృద్ధులకు శుక్రవారం రగ్గులు పంపిణీ చేశారు. అమెరికాలో ఉంటున్న తమ్మిశెట్టి రత్నగిరి, వారి కుటుంబ సభ్యులు, స్నేహితుల సహకారంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్టు సంస్థ ప్రతినిధి షేక్ ఇబ్రహీం తెలిపారు. రత్నగిరి మాతృమూర్తి సీతారావమ్మ, మళ్ళ రాజు, కొండూరు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పట్టిసీమ వీరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

పోలవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీక శుక్రవారం సందర్భంగా పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి, భద్రకాళికి భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి పట్టిసీమ శివక్షేత్రాన్ని దర్శించారు. సుమారు 800 మంది భక్తులకు అన్నదానం చేసినట్టు ఆలయ ఈవో చాగంటి సురేష్ నాయుడు తెలిపారు.

కాలినడకన మద్దికి..

టి.నరసాపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మద్ది ఆంజనేయ స్వామి క్షేత్రానికి శుక్రవారం అధిక సంఖ్యలో హనుమాన్ చాలీసా భక్తులు బృందం కాలినడకన వెళ్ళారు. చాట్రాయి మండలానికి చెందిన 50 మంది భక్తులు మండలం మీదుగా సుమారు 70 కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ వెళ్ళారు. శుక్రవారం ఉదయం బయలుదేరి రాత్రికి చేరుకుని మొక్కలు తీర్చుకుంటామని వారు తెలిపారు. వీరికి మండలంలో పలుచోట్ల గ్రామస్తులు మంచినీరు, అల్పాహారం అందించారు. పాదయాత్రగా వెళ్ళిన వారిలో మిద్దే నారాయణస్వామి, గోదా నరసింహమూర్తి, పలగాని నారాయణరావు, చీపు రజనీ తదితరులు ఉన్నారు.

చాట్రాయిలో చిన్న వెంకన్న రథయాత్ర



చాట్రాయి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ద్వారకా తిరుమల వెంకటేశ్వరస్వామి రథయాత్ర విస్సన్నపేట వెళుతూ కొంత సేపు చాట్రాయి సెంటర్‌లో ఆగింది. భక్తులు స్వామివారికి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.



చాట్రాయిలో ట్రాఫిక్ ఇక్కట్లు

చాట్రాయి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం చాట్రాయిలో ట్రాఫిక్ ఇబ్బందులతో నిత్యం ప్రజలు, వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాలను కలిపే రహదారిలో చాట్రాయి ఉండటంతో ప్రతి రోజు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. చాట్రాయిలో రోడ్లు చాలా ఇరుకుగా ఉంటాయి. దీనికి తోడు ఆర్టీసీ బస్సులు, స్కూల్ బస్సులు, చిన్నకార్లు, ద్విచక్రవాహనాలు పెద్ద సంఖ్యలో తిరుగుతుండటంతో తరుచూ ట్రాఫిక్ నిలచిపోతున్నది. జంగారెడ్డిగూడెం ప్రాంతంలో జరుగుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేకి చాట్రాయి మీదుగా భారీ వాహనాలలో కంకరు తరలిస్తున్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటున్నది. చాట్రాయి గ్రామంలో రోడ్లు వెడల్పు చేస్తేనే ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుంది. 20 ఏళ్ళ నుండి చాట్రాయిలో రోడ్లు వెడల్పు చెయ్యాలని ప్రజాప్రతినిదులు ప్రజలు కోరుతున్నా పాలకులు పట్టించుకోలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చాట్రాయిలో రోడ్లు వెడల్పు చేసి ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు క్రీడల పట్ల ఆసక్తి చూపి రోజుకు ఒక గంట పాటు అయినా ఆటలు ఆడడం వల్ల శారీరక ధృడత్వంతో పాటు మానసిక ఉల్లాసం పెంపొందించుకోవచ్చునని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో శుక్రవారం ఉదయం పోలీస్ వార్షిక స్పోర్ట్స్‌మీట్‌ను ఎస్పీ ప్రారంభించారు. జిల్లాలో ని అన్ని సబ్ డివిజన్ల పోలీసులు కవాతు నిర్వహిం చారు. అనంతరం బెలూన్‌లు ఎగురవేసి ఎస్పీ స్పోర్ట్స్ మీట్ ప్రారం భించారు. స్పోర్ట్స్ అంటే లగ్జరీగా భావిస్తారని స్పోర్ట్స్‌ను స్పోర్టీవ్‌గా తీసు కుంటే ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉంటారని సూచించారు.అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న ప్రజలకు స్పోర్ట్స్‌లో ప్రోత్సాహాన్ని కలిగించడానికి చర్యలు తీసుకుంటున్నా మన్నారు. పాతకాలంలో ప్రతి పోలీస్‌స్టేషన్ వద్ద వాలీబాల్, టెన్నిస్ కోర్టులు ఉండేవని గుర్తుచేశారు. జిల్లా అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు, ఏఆర్ అదనపు ఎస్పీ శేఖర్, ఏఆర్ డీఎస్పీ శ్రీహరి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు భారీ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కలిదిండి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పెదపుట్లపూడిలో 27 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శనివారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ పుట్టా మహేష్, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌లు హాజరవుతారని తెలిపారు.

25న మండవల్లిలో గౌడ కార్తీక వనసమారాధన

మండవల్లి నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గౌడ సంక్షేమ సంఘ 20వ కార్తీక వన సమారాధన ఈ నెల 25వ తేదీ మండవల్లి మండలం శోభనాద్రిపురం అగ్రహారం నందు శ్రీభ్రమరాంబ సమేత చిన్న మల్లేశ్వరస్వామి శివాలయం వద్ద నిర్వహించనున్నట్లు వనసమారాధన కమిటీ చైర్మన్ పడమట గణేష్‌బాబు శుక్రవారం తెలిపారు. రాష్ట్ర గౌడ సంఘ నాయకుడు పోసిన చెంచు రామారావు సభాధ్యక్షత వహిస్తామని ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ, మంత్రి అనగాని సత్యప్రసాద్, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తిలు పాల్గొంటారని తెలిపారు.

సైకిల్‌పై శబరిమలై యాత్ర

కైకలూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): 40 రోజులు ఉపవాస దీక్షలు నిర్వహించిన అయ్యప్పస్వాములు సైకిల్‌పై శబరిమాల యాత్రకు శుక్రవారం బయల్దేరారు. కైకలూరు ఏలూరు రోడ్డులోని అయ్యప్పస్వామి అలయం వద్ద నుంచి ఆచవరానికి చెందిన మాడపాటి శ్రీను (ఆటోశ్రీను), మాడపాటి వీరయ్య, డి.ధనుంజయ స్వాములు సైకిల్‌పై యాత్రకు వెళ్లారు. గత సంవత్సరం ఇలాగే సైకిల్‌పై శబరిమలైకు వెళ్లి స్వామిని దర్శించుకుని వచ్చారు.

కార్మికులు హక్కులు కోల్పోయే ప్రమాదం

నూజివీడు టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సంపద సృష్టించే కార్మికులు ప్రభుత్వ విధానాల వల్ల వారి హక్కులను కోల్పోయే ప్రమాదం ఉందని ఏఐటీయుసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ అన్నారు. నూజివీడు అమర్‌భవన్‌లో నియోజకవర్గ సమితి సమావేశం నియోజకవర్గ అధ్యక్షుడు అక్కినేని ఆంజనేయ ప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కార్మిక వర్గం విపత్కర పరిస్థితుల్లో చిక్కుకుందన్నారు. నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఎండు గడ్డి ధరకు రెక్కలు



చాట్రాయి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వరి (ఎండు) గడ్డి ధరలకు రెక్కలు రావటంతో పశు పోషకులకు ఆర్థిక భారమైంది. రైతులు మిషన్లతో వరికోతలు కోస్తుండటంతో గడ్డి ముక్కలు ముక్కలుగా చేను అంతా చల్లాచెదురుగా పడిపోతున్నది. దీనిని పోగు చేసి ఇంటింటికి తెచ్చుకోవటానికి కూలీలు దొరక్కపోవటం, దొరికినా ఖర్చు ఎక్కువ అవుతుండటంతో పొలంలోనే గడ్డిని తగలబెడుతున్నారు. దీనితో పశుపోషకులకు గడ్డి కరువైంది. చేసేది లేక సరిహద్దున ఉన్న తెలంగాణ గ్రామాలకు పశుపోషకులు వెళ్ళి వరిగడ్డి కొని ట్రాక్టర్లతో తెచ్చుకుంటున్నారు. ఒక్కో ట్రాక్టర్ గడ్డి ఇంటికి చేరేసరికి రూ.10 వేలు పైనే అవుతున్నదని, అదే స్థానికంగా దొరికితే రూ.5 వేలకే వచ్చేదని పశుపోషకులు వాపోతున్నారు. భవిష్యత్తులో పశుపోషణ కష్టం అయ్యే పరిస్థితులు కన్పిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సీఎం సహాయ నిధి చెక్కులు అందిస్తున్న ముద్దరబోయిన వెంకటేశ్వరరావు

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత

నూజివీడు టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యానికి ఎన్డీఏ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. నూజివీడులో ఆయన కార్యాలయంలో శుక్రవా రం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందించారు. పొలసానపల్లి గ్రామానికి చెందిన జాజుల వెంకటేశ్వరరావుకు రూ.30 వేలు, అన్నవరం గ్రామానికి చెందిన గుండుబోయిన వెంకటేశ్వ రరావుకు రూ.32,100, దేవరగుంట గ్రామానికి చెందిన దుట్టా వర ప్రసాద్‌కు రూ.30 వేలు సీఎం సహాయ నిధి చెక్కులు అందించారు.

టీడీపీతోనే పేదల సంక్షేమం



ముసునూరులో టీడీపీ సభ్యత్వ నమోదు

ముసునూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీతోనే పేదల సంక్షేమం సాధ్యమని నియోజకవర్గ తెలుగుయువత కార్యాదర్శి కొండేటి ఉదయ్‌కిరణ్, క్లస్టర్ ఇన్‌చార్జ్ గార్లపాటి నరసింహరావు అన్నారు. ముసునూరులో టీడీపీ సభ్యత్వ నమోదును నాయకులు వేగవంతం చేశారు. శుక్రువారం బీసీ, ఓసీ కాలనీల్లో నరసింహారావు ఆధ్వర్యంలో ఇంటికి వెళ్ళి సభ్యత్వ నమోదు చేశారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యాకర్తకు, కుటుంబానికి అండగా ఉండేలా రూ 5లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని పార్టీ అధినేత, సీం చంద్రబాబునాయుడు కల్పించారని నాయకులు అన్నారు. ఈ కార్యాక్రమంలో నియోజకవర్గ బీసీసెల్ ఆర్గనైయిజింగ్ సెక్రటరీ నక్కా యోహాను,వార్డు సభ్యుడు ఎన్.రాంబాబు, రెడ్డి కృష్ణ పాల్గొన్నారు.

చూచి రాతలు!

కుక్కునూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కుక్కునూరులోని ఓ ప్రైవేటు డిగ్రీ కాలేజీలో జరుగుతున్న డిస్టెన్స్ డిగ్రీ పరీక్షల తీరు చూసి అందరూ నివ్వెరపోయే పరిస్థితి ఏర్పడింది. పరీక్షల్లో చూచిరాతలు జరగటంతో పాటు పరీక్షలు రాయాల్సిన వారి స్థానంలో స్థానిక మహిళలు వెళ్ళి పరీక్షలు రాసినట్టు తెలుస్తోంది. అలా పరీక్షలు రాసిన మహిళలకు ఒక్కో పరీక్షకు రూ.200 చెల్లిస్తున్నారు. పుస్తకాలు పక్కనపెట్టుకుని పక్కపక్కనే కూర్చుని పరీక్షలు రాయడం గమనార్హం. వారం రోజులుగా ఇదే తరహాలో పరీక్షలు జరుగుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. పరీక్షా కేంద్రంలో సీసీ.కెమెరాలు కూడా లేకపోవడం విశేషం. కాగా స్థానిక మహిళలు పరీక్షలు రాసి బయటకు వస్తుండటం చూసి స్థానికులు నివ్వెరపోతున్నారు. స్థానికులు మీడియాకు సమాచారం ఇవ్వడంతో అసలు విషయం బయటపడింది. అధికారులు ఇప్పటికైనా ఇటువంటి వాటిపై కఠినంగా చర్యలు తీసుకోఎవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎనిమిది మంది బైండోవర్

ఆగిరిపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గతంలో బెల్ట్‌షాపులు నిర్వహించిన వారిని, బెల్లం విక్రేతలు 8మందిని శుక్రవారం ఆగిరిపల్లి తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశారు. మరలా వీరు నేరాలకు పాల్పడితే లక్ష రూపాయలు జరిమానా, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు రద్దుచేస్తామని ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య హెచ్చరించారు.

ఆగిరిపల్లి మండలం నరసింహపాలెం గ్రామానికి చెందిన మందపాటి బుజ్జారావు వద్ద 30 మద్యం సీసాలు స్వాధీనపర్చుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసుపై డీఎస్పీ విచారణ



ముసునూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు వ్యక్తుల మధ్య పొలం సరిహద్దు వివా దంలో నమోదైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసుపై శుక్రవారం నూజివీడు డీఎస్పీ కె.వి.వి.ఎస్.వి ప్రసాద్ విచారణ చేశారు. మండలంలోని గుళ్ళపూడి గ్రామానికి చెందిన కందుల ఏడుకొం డలు, పామర్తి రామకృష్ణ మధ్య పొలం సరిహ ద్దు వివాదం జరిగిన నేపథ్యంలో తనను కులం పేరుతో దుషించాడని రామకృష్ణపై ఏడుకొండలు ఇచ్చిన ఫిర్యాదుపై ముసునూరు పోలీసులు ఆగస్టు 14వ తేదీన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసును నమోదు చేశారు. దీనిపై డీఎస్పీ గుళ్ళపూడి గ్రామంలో క్షేత్రస్థాయి విచారణ చేశారు. ఈ సందర్భంగా ఆయన వివాదానికి దారితీసిన పొలం సరిహద్దును పరిశీలించి, చుట్టు ప్రక్కల రైతులు, స్థానికులతో సైతం మాట్లాడారు. అలాగే ఫిర్యాది ఏడుకొండలు, రామకృష్ణలను విడి విడిగా విచారించి, పలు విషయాలను నమోదు చేశారు. ఎస్ఐ ఎం.చిరంజీవి పాల్గొన్నారు.

భవన నిర్మాణంలో నాణ్యత పాటించాలి



ల్యాబ్ భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో సుబ్బారావు

ముసునూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గురుకుల బాలికల కోసం నూతనంగా నిర్మిస్తున్న ల్యాబ్ భవనంలో నాణ్యత ప్రమాణాలు పాటించి, త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈవో బి.వి.ఎస్.సుబ్బారావు అన్నారు. శుక్రవారం భవన నిర్మాణం, ఆట స్థలాల అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం నుంచి ల్యాబ్ భవనం నిర్మాణానికి రూ.15లక్షలు, కోకో, కబడ్డీ, ల్యాంగ్ జంప్ పిట్ కోర్టుల అభివృద్ధికి రూ.5లక్షల నిధు లు మంజూరైనట్లు తెలిపారు. భవ నం, కోర్టుల నిర్మాణ పనులు నిబం ధలన ప్రకారం, నాణ్యతతో జరిగేలా ఎప్పటికప్పుడు పర్యక్షించాలని పాఠశా ల ప్రిన్సిపాల్ కె.ప్రవీణకు ఎంఈవో సూచిం చారు. అనంతరం బాలికలకు అందుతున్న సౌకర్యాలపై ఆయన ఆరాతీశారు. కార్యక్రమంలో పీడీ నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

వూటుకూరులో కొనసాగుతున్న పోలీస్ పికెట్

ముదినేపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వూటుకూరులో పోలీస్ పికెట్ కొనసాగుతోంది. ఈ ఏడాది సెప్టెంబరు 7న ఆ గ్రామంలో పోసిన బాలకోటయ్య అనే వ్యక్తిని కొందరు వ్యక్తులు హత్య చేసిన నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా అప్పట్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఈ కేసులో అరెస్టయిన ఐదుగురు నిందితులను బందరు సబ్ జైలు రిమాండ్‌కు పంపగా, నెల రోజుల అనంతరం ఇటీవల ప్రధాన నిందితుడు గూడపాటి శ్రీనుబాబు మినహా మిగిలిన నలుగురికి బెయిల్ వచ్చింది. ఆ గ్రామానికి చెందిన ముగ్గురు నిందితులు నేటికీ గ్రామంలోకి రాలేదు. నిందితుల్లో కొందరు హతుడి కుటుం బానికి బంధువులు కావడం, వారు గ్రామంలోకి వస్తే రెండు కుటుంబాల మధ్య ఘర్షణలు తలెత్తే అవకాశం ఉండడంతో ఎస్ఐ వీరభద్ర రావు పర్యవేక్షణలో పికెట్‌ను కొనసాగిస్తున్నారు.

పెయ్యేరు మంచినీటి చెరువు కలుషితం

ముదినేపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పెయ్యేరులోని మంచినీటి చెరువు కలుషితమైంది. రక్షిత మంచినీటి పథకానికి సంబంధించిన ఈ చెరువులోని నీరు రంగు మారి దుర్వాసన వెదజల్లుతోంది. రంగు మారిన నీటిని వినియోగించడం వల్ల గ్రామస్థులకు దురదలు వస్తున్నాయి. శుక్రవారం ఉదయం చెరువులోని నీటిపై దుర్వాసన వెదజల్లే మట్టి తెట్ట తేలింది. చెరువులోని చేపలు చనిపోయి నీటిపై తేలియాడుతూ కనిపించాయి. దీంతో చెరువునీటిని వినియోగించేందుకు గ్రామస్థులు భయపడుతు న్నారు. చెరువులోని నీటిని తొలగించి, చెరువును ఆరగట్టి కొత్తగా నీటితో నింపాలని మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు అల్లా భక్షు, బీజేపీ యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మొవ్వ ఫణీంద్ర కోరుతున్నారు.



కలుషితమైన నీటిపై తెట్టు, చనిపోయి తేలిన చేపలు



అమర్నాథ్ ఈశ్వర స్వామి అలంకరణలో సోమేశ్వరస్వామి

సోమేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ

ముదినేపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసోత్సవాల్లో భాగంగా అల్లూరులోని పార్వతీ సమేత సోమేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివార్లను శుక్రవారం అమర్నాథ్ ఈశ్వరస్వామిగా అలంకరిం చారు. ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అర్చకుడు సుబ్బరాయ శర్మ అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

భైరవపట్నంలో 10మంది జూదరుల అరెస్ట్

మండవల్లి నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలం భైరవపట్నం శివారు కోగంటి విజయ్ చెరువుల వద్ద గురువారం రాత్రి 11గంటల సమయంలో జూదం ఆడుతున్న పదిమందిని మండవల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కోగంటి విజయ్ ఆధ్వర్యంలో పేకాట ఆడుతున్న పది మందిని పట్టుకుని వారి వద్ద నుంచి లక్షా 13వేలు నగదును స్వాధీనం చేసుకున్నారు. మండవల్లి ఎస్ఐ రామచంద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ సుధాబత్తుల విజయకుమార్

లక్ష్యం నిర్దేశించుకోవాలి

కైకలూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని విద్య నభ్యసిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ప్రొఫెసర్ సుధాబత్తుల విజయకుమార్ అన్నారు. శుక్రవారం భుజబలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్లో మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీయర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. సంస్థ మాజీ చైర్మన్ కొండ్రెడ్డి సత్యనారాయణ, కార్యదర్శి మాడెం సత్యనారాయణ, హెచ్ఎం ఎన్ఎల్ రాజ్యాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

పంచాయతీరాజ్ ఎస్ఈ



వెంకటాపురంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ రమణ

కలిదిండి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని పంచాయతీరాజ్ ఎస్ఈ ఎం.వి.రమణ అన్నారు. వెంకటాపురంలో రూ.18.51 లక్షలతో నిర్మించే సీసీ రోడ్ల నిర్మాణాలను శుక్రవారం పరిశీలించారు. మండలంలో 23 పంచాయతీల్లో రూ.5.80 కోట్లతో చేపట్టిన 60 సీసీ రోడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నాసిరకంగా సీసీ రోడ్లను నిర్మిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీరాజ్ డీఈఈ డి.లీలా మోహన్‌రావు, ఏఈఈ బుసనబోయిన శ్రీనివాస్, కూటమి నేతలు పాల్గొన్నారు.

పార్వతీదేవికి గాజుల అలంకరణ



కలిదిండి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీక శుక్రవారం సందర్భంగా కోరుకొల్లు సోమేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పార్వతీ దేవిని గాజులతో అలంకరించి సామూహిక కుంకుమ పూజలు చేశారు. భక్తులకు అన్నసమా రాధన నిర్వహించారు. మాజీ ఎంపీపీలు వలవల రామారావు, సిహెచ్.మురళీకృష్ణ, కేశిరెడ్డి బలరామ్, ఈవో శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వం స్వీకరణ

ముదినేపల్లి/కలిదిండి నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వాలను ముదినేపల్లి మండలానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు, మండల పార్టీ అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, కేడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ బొర్రా చలమయ్య, కలిదిండి మండలం భాస్కరావు పేటకు చెందిన టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, వెంకటాపురానికి చెందిన ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, కాళ్లపాలేంకు చెందిన టీడీపీ మండల ఉపాధ్యక్షుడు మేడిశెట్టి సీతారామాంజనేయులు రూ.లక్ష సభ్యత్వ రుసుము చెల్లించి పార్టీ శాశ్వత సభ్యులుగా నమోదయ్యారు. ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు శుక్రవారం ఏలూరులోని ఆయన కార్యాలయంలో సభ్యత్వ రుసుమును అందజేశారు.





ఎంపీ మహేశ్ సమక్షంలో టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్న శోభనాద్రి చౌదరి, చలమయ్య, జోగి రాజు, శ్రీనివాస్ చౌదరి, సీతారామాంజనేయులు